చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## పీ4తో పేదరికం లేని సమాజం చంద్రబాబు లక్ష్యం

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

8



# ప్రజలే ముందు.. తర్వాతే ఏదైనా

- పేదల కోసం సంపద సృష్టిస్తా
- పేదరికం నిర్మూలనకే పీ-4 తెచ్చాం
- గత ప్రభుత్వ బటన్లు.. మన పెన్షన్లకు సాటిరావు
- అనవసర విమర్శకులను ప్రజలే నిలదీయాలి
- ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తా
- స్కూళ్లు తెరిచేనాటికి నియామకాలు పూర్తిచేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- కొత్తగొల్లపాలెంలో పేదల సేవలో పాల్గొన్న సీఎం
- లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేత

2





### బయోఇంధన రంగంలో..

## విప్లవాత్మక మైలురాయి రిలయన్స్ సీబీజీ!

- నేడు కనిగిరిలో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శ్రీకారం
- 5ఏళ్లలో రూ.65వేల కోట్ల పెట్టుబడులు, 2.5లక్షల మందికి ఉపాధి
- మంత్రి లోకేష్ చొరవతో ఏపీ ప్రభుత్వంతో రిలయన్స్ ఒప్పందం
- 500 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్న రిలయన్స్
- వినియోగంలోకి బంజరు భూములు

4



మంత్రి లోకేష్ చొరవతో కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న రిలయన్స్ (ఫైల్ ఫోటో)

## పేదలకు 'పట్టా'భిషేకం

- పేదరిక నిర్మూలన దిశగా మంత్రి నారా లోకేష్ అడుగులు
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అమలు చేస్తున్న లోకేష్
- నెరవేరుతున్న మంగళగిరి పేదల దశాబ్దాల కల
- మొదటిదశలో మూడు వేల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం
- మన ఇల్లు - మన లోకేష్ పేరుతో రేపటి నుండి పట్టాల పంపిణీకి శ్రీకారం
- 4 నుండి 12 వరకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు పట్టాలు అందివ్వనున్న మంత్రి లోకేష్

4

## వక్ఫ్ బిల్లుపై ముస్లింకు అండగా టీడీపీ

- జేపీసీ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి
- ముస్లిం సమాజంతో విస్తృతంగా చర్చలు
- జేపీసీ ముందుకు నాలుగు సవరణలు
- మూడింటికి ఆమోదం
- ముస్లింల అభిప్రాయాలు పట్టించుకోకుండా జగన్ ద్రోహం

7

### రెండో విడత

## దీపం 2 ప్రారంభం

- లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ
- రబీలో 10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



9

చైతన్యరథం

- పేదల కోసం సంపద సృష్టిస్తా
- పేదరికం నిర్మూలనకే పీ-4 తెచ్చాం
- గత ప్రభుత్వ బటన్లు.. మన పెన్షన్లకు సాటిరావు
- అనవసర విమర్శకులను ప్రజలే నిలదీయాలి
- ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తా
- స్కూళ్లు తెరిచేనాటికి నియామకాలు పూర్తిచేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- కొత్తగొల్లపాలెంలో పేదల సేవలో పాల్గొన్న సీఎం
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేత




# ప్రజలే ముందు.. తర్వాతే ఏదైనా

బాపట్ల (చైతన్య రథం): సంపద సృష్టించి పేదల సంక్షేమానికి వెచ్చిస్తామని, పేదరిక నిర్మూలనకు పీ-4 విధానంతో శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలే ముందు.. తర్వాతే మిగిలినవాటికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. మంగళవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో పేదల సేవలో కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి.. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

## వారు నొక్కిన బటన్లు మనమిచ్చే పెన్షన్లతో సమానం

బటన్లు నొక్కామని కొందరు గొప్పగా చెప్పుకుంటున్నారని, వారునొక్కిన బటన్లు మనమిచ్చే పెన్షన్లతో సమానమన్నారు. అనవసర విమర్శలు చేసేవారిని ప్రజలు నిలదీయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముక. రాష్ట్రంలో టీడీపీ ఇంత బలంగా ఉందంటే అందుకు వెనుకబడిన వర్గాలే కారణం. 43 ఏళ్లుగా టీడీపీ జెండా మోసింది బలహీన వర్గాలే. బెదిరించినా భయపడకుండా ఎదురొడ్డి పోరాడారు. జెండా మోశారు. పార్టీని ఆదుకున్న వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యత నేను తీసుకుంటానని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## అసమర్థ ప్రభుత్వంలో అప్పులే మిగిలాయి

గత ప్రభుత్వ అసమర్థ పాలన ఎలా ఉందో అందరం చూశాం. రాష్ట్రాన్ని సర్వనాశం చేసిపోయారు. రూ.10 లక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చింది. ఓవైపు సంక్షేమం,అభివృద్ధి చేస్తూనే మరోవైపు అసలు, వడ్డీ రెండూ కట్టాలి. సంపద సృష్టించి ఆదాయం పెంచి దాన్ని నిరంతరం పేదలకే ఖర్చు పెడతానని హామీ ఇస్తున్నా. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు మిత్రులు పవన్ కల్యాణ్, నేనూ, బీజేపీ జతకట్టాం. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



## పేదల కళ్లలో ఆనందం చూస్తున్నా

నేను ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. 28 రకాల పింఛన్లు ఇస్తున్నాము. మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 63 లక్షల మందికి ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసే రాష్ట్రం దేశంలో ఒక్క ఏపీనే. రూ.200 పింఛను రూ.2వేలు చేసింది నేనే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3,000 పింఛను రూ.4000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ.10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛను ఇస్తూ.. మానవత్వాన్ని చాటుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నాను. ప్రతి నెలా ఒకటిన ఉదయం 9 గంటలకే 80శాతం, తొలిరోజే 98శాతం మందికి పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తున్న అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నానని చంద్రబాబు అన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా

కొందరి ఆదాయం కంటే పింఛను ద్వారానే ఎక్కువ వస్తోంది. ఉపాధి నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లిన వారు పింఛను అందుకోలేకపోయేవారు. అలాంటి వారికి గత ప్రభుత్వంలో పింఛను ఇవ్వలేదు. కానీ మన ఎన్డీఏ ప్రభుత్వంలో మూడో నెలలోనైనా పింఛను తీసుకునే అవకాశం కల్పించాము. అలా రెండు నెలలు వరుసగా పింఛను తీసుకోని వారు మన రాష్ట్రంలో 93,324 మంది ఉన్నారు. వీరికి పింఛను ఆపేస్తే ప్రభుత్వానికి రూ.74 కోట్లు మిగుల్తుంది. కానీ పేదలకు ఆర్థిక భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ఆ సొమ్ము చెల్లిస్తున్నాము. అలాగే మూడు నెలలకూ పింఛను తీసుకోనివారు 16 వేలమంది ఉన్నారు. వారికీ రూ.14 కోట్లు చెల్లిస్తున్నాం. భర్త చనిపోయిన భార్యకు వెంటనే పింఛను ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. పింఛన్లు పంపిణీని టెక్నాలజీతో అనుసంధానం చేస్తున్నాం. పింఛను ఇంటికి తెస్తున్నారా? లేదా? మర్యాదగా ఇస్తున్నారా? లేదా? అనే దానిపై నేను నిరంతరం మానిటరింగ్ చేస్తున్నాను. తెలంగాణలో రూ.2,016, తమిళనాడులో రూ.1000, కేరళలో రూ.1600, కర్ణాటకలో రూ.600, యూపీ, ఒడిశాలో రూ.500 చొప్పున పింఛన్లు ఇస్తున్నారు. సంక్షేమం ఇవ్వలేదనే వారికి ఇదే సమాధానమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

రాజధాని అమరావతి పనులకు శ్రీకారం చుట్టాం. నాలుగేళ్లలో అమరావతికి పూర్వ వైభవం తెస్తాం. ఏపీ జీవనాడి పోలవరం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 2027నాటికి పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానానికి శ్రీకారం చుడతాం. రాష్ట్రవ్యాప్తంగా 200కి పైగా అన్నక్యాంటీన్లు పెట్టి పేదలకు భోజనం పెడుతున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లు మంజూరు చేసింది. విశాఖకు రైల్వే జోన్ వస్తోంది.గత ఐదేళ్లూ రోడ్లు ఎలాఉన్నాయో చూశారు. ఆ గుంతల రోడ్లలో ఆస్పత్రికి వెళ్తూ దారి మధ్యలోనే గర్భిణీ డెలివరీ అయిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పటికే రోడ్ల మరమ్మతులు చేపట్టాం. భవిష్యత్‌లో రోడ్లన్నీ అద్దంలా మెరిసి పోతాయి. ఈ నెలలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి జూన్‌లోగా కొత్త టీచరు పోస్టులు భర్తీ చేస్తాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలండర్లు ఏడాదికి 3 ఇస్తున్నాం. కేంద్రం ఇచ్చే ఆరువేలతో కలిపి

- (మిగతా వివరాలు 3లో)





# ప్రజలే ముందు.. తర్వాతే ఏదైనా

(2వ పేజీ తరువాయి)

రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వేస్తాం. రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. ఈనెలలోనే మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తాం. నేను తెచ్చిన డ్వాక్రా సంఘాలు నేడు ఒక వ్యవస్థగా మారడం గర్వంగా ఉందని చంద్రబాబు అన్నారు.

## అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు

47 ఏళ్లుగా ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. సమైక్యాంధ్రలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్షనేతగా, నవ్యాంధ్రలో ఆరో ఏడాది ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం లభించింది. ఇది నాకు ప్రజలిచ్చిన అరుదైన గౌరవం. ఏ నాయకుడికీ ఈ అవకాశం దొరకలేదు. పేదరికం లేని సమాజమే నా ఆశయం. సంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఈ లక్ష్య సాధనలో భాగంగానే పీ-4 కార్యక్రమం రూపొందించాం. సమాజంలో ఉన్నతంగా ఉన్న 10 శాతం సంపన్న వర్గాలు సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను ఆదుకుని వారి అభ్యున్నతి కొరకు స్వచ్ఛందంగా ముందుకురావాలి. పేద కుటుంబాలను ఆదుకునేవారు మార్గదర్శిగా, సాయం అందుకున్నవారు బంగారు కుటుంబంగా పరిగణించబడతారు. ఎన్టీఆర్, అంబేద్కర్, అబ్దుల్ కలాం సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారిగా పుట్టలేదు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు, పింఛను, మంచి నీటి కుళాయి, కరెంటు, మరుగుదొడ్లు, డ్రైనేజ్, ఇంటర్నెట్‌వంటి సౌకర్యాలు కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## మార్గదర్శులకు సీఎం అభినందన

పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చిన విక్రమ్ నారాయణరావు, వసంత



శ్రీనివాసరావును సీఎం చంద్రబాబు అభినందించారు. దాతలిద్దరూ చెరో 15 కుటుంబాలను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకోనున్నారు.

## పర్చూరు నియోజకవర్గానికి సీఎం వరాలు

పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మన స్ఫూర్తిగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు షిప్ బిల్డింగ్, షిప్ రిపేరింగ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు ప్రభుత్వంనుంచి అన్ని విధాలా సహకరిస్తామని సీఎం చెప్పారు. అలాగే నాగార్జునసాగర్ కాలువ ఆధునీ కరణ పనులు, నూతన ఎన్సీపీ కార్యాలయం, షాదీఖా నాలు, దర్గాల ఆధునీకరణ పనులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణం, బీసీ, ఓసీలకు శ్మశాన వాటికల నిర్మాణం, రూ.9 కోట్ల 10 లక్షల వ్యయంతో జాతీయ రహదారి నుంచి వలపర్ల ఇండస్ట్రియల్ పార్క్‌కు డబుల్ రోడ్డు, వలపర్ల గ్రామంలో వాటర్ స్టోరేజ్ ట్యాంక్, ఇంకొల్లు-మార్టూరు-పర్చూరులో ఆటోనగర్ ఏర్పాటుకు అనుమతులు, కొమ్మూరు కాలువ భూసేకరణకు రూ.5 కోట్లు మంజూరు, పర్చూరు-కారంచేడు- ఇంకొల్లు- చినగంజాంలో మూడు వ్యవసాయ మార్కెట్లు, ఇంకొల్లులో డ్రైనేజ్ సమస్య పరిష్కారం సహా నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేదలకు వైద్యానికి ఆర్థిక సాయం వంటి అన్ని పనులకూ ప్రభుత్వం నుంచి వెంటనే నిధులు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు వరాలు కురిపించారు.

## పోలీసువై ప్రజల్ని రక్షించాలి

కొత్తగొల్లపాలెంలో మానసిక దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి ఇంటికి పింఛను అందించేందుకు సీఎం వెళ్లారు. సుభాషిణి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతోపాటు ఆమె తల్లికి ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుభాషిణి చెల్లెలు భరణిని ఏం చదువుకుంటున్నావ్, ఏం కావాలనుకుంటున్నావని సీఎం అడిగారు. భరణి సమాధానమిస్తూ.. తనకు పోలీస్ అవ్వాలని ఉందని చెప్పింది. జనాల్ని బాగా కొట్టొచ్చని పోలీస్ అవుదామనుకుంటున్నావా? అని ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్వుతూ చమత్కరించారు. పోలీసువై ప్రజల్ని కాపాడాలని సీఎం ఆశీర్వదించారు. చదివించుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని కుటుంబ సభ్యులు తెలపగా ఆమెను కస్తూర్బాగాంధీ పాఠశాలలో చేర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ఇష్టపడి చదువుకోవాలి

మరో లబ్ధిదారు బత్తుల జాలమ్మ గృహానికి వితంతు పెన్షన్ పంపిణీ చేశారు. జాలమ్మ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో చూసి చలించిపోయిన సీఎం వెంటనే గృహాన్ని మంజూరు చేయడంతో పాటు గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ఆదేశించారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కునేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏం చదవు కుంటున్నావని జాలమ్మ చిన్న కుమారుడుని ప్రశ్నించగా పదవ తరగతి మధ్యలో నిలిపేశానని చెప్పారు. చదువుకుంటావా? అని సీఎం అడగ్గా... చదువు రాదని అతను తిరిగి సమాధానం ఇచ్చాడు. ఎందుకు రాదు, మేమంతా వచ్చి చదువుకున్నామా, ఇష్టపడి చదవుకున్నాం అని చంద్రబాబు అన్నారు. చదవు రాదని మనసులో పడితే రాదని, వస్తుందంటే వస్తుందని ధైర్యం చెప్పారు. ఎప్పుడూ గొర్రెలు మేపడమే కాదు, పైస్థాయికి రావాలని సీఎం చంద్రబాబు సూచించారు.





















చైతన్యరథం

## బయోఇంధన రంగంలో..

# విప్లవాత్మక మైలురాయి రిలయన్స్ సీబీజీ!

- నేడు కనిగిరిలో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శ్రీకారం
- 5ఏళ్లలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు, 2.5లక్షల మందికి ఉపాధి
- మంత్రి లోకేష్ చొరవతో ఏపీ ప్రభుత్వంతో రిలయన్స్ ఒప్పందం
- 500 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్న రిలయన్స్
- వినియోగంలోకి బంజరు భూములు



మంత్రి లోకేష్ చొరవతో కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న రిలయన్స్ (ఫైల్ ఫొటో)

అమరావతి (చైతన్యరథం): భారత్‌లో 2035 నాటికి కర్బన ఉద్గారాలను జీరో స్థాయికి తేవడమే లక్ష్యంగా సాంప్రదాయేతర ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతోంది. ఈ లక్ష్యసాధన కోసం విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగవంతంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో రిలయన్స్ సంస్థ రూ.65వేల కోట్లతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రిలయన్స్ తొలి సీబీజీ ప్లాంట్‌కు ప్రకాశం జిల్లా కనిగిరిలో ఈ నెల 2వ తేదీన మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తోపాటు ఇతర మంత్రులు, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ మెంటార్ పీవీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ బిజినెస్ సీఈఓ హరీంద్ర కే త్రిపాఠి పాల్గొంటారు. బయో ఇంధన రంగంలో ఇదొక మైలురాయిగా నిలవనుంది. రాబోయే 5 ఏళ్లలో రిలయన్స్ ఏర్పాటుచేసే 500 సీబీజీ ప్లాంట్లకు అనుబంధంగా ఎనర్జీ ప్లాంటేషన్ ద్వారా 5లక్షల ఎకరాల బంజరుభూమి ఉపయోగంలోకి వస్తుంది. రాష్ట్రంలో 2.5లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అన్ని ప్లాంట్లు ఉత్పత్తి ప్రారంభిస్తే ప్రతి ఏటా 40 లక్షల మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది. వ్యవసాయ అవశేషాలు, పారిశ్రామిక వ్యర్థాలు, మున్సిపల్ ఘన వ్యర్థాలు, ఇంధన పంటల ఆధారంగా రిలయన్స్ సంస్థ పాన్ ఇండియా సీబీజీ ప్లాంట్లను నిరర్థక భూముల్లో ఏర్పాటు చేస్తోంది.

### బంజరు భూముల్లో..

రిలయన్స్ సంస్థ దేశవ్యాప్తంగా 4 ఇంటిగ్రేటెడ్ సీబీజీ హబ్‌లను విభిన్న బంజరుభూముల్లో ఏర్పాటుచేస్తుండగా, అందులో ప్రకాశం జిల్లాలో ఒక హబ్ ఏర్పాటు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, అనంతపూర్, చిత్తూరు, కడప జిల్లాల్లో అధికంగా బంజరుభూములు ఉన్న ప్రాంతాల్లో సీబీజీ ప్లాంట్లను ఏర్పాటుచేస్తారు. రాష్ట్రంలోని నిరర్థక భూముల్లో కేవలం 3నుంచి 4శాతం భూమిలో ఎనర్జీ క్రాప్స్ ద్వారా పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో రిలయన్స్ 500 ఇంటిగ్రేటేడ్ సీబీజీ ప్లాంట్లను ఏర్పాటుచేస్తోంది. సీబీజీ ప్లాంట్, క్యాప్టివ్ ఎనర్జీ ప్లాంటేషన్ కోసం ప్రతిప్లాంటుకు వెయ్యి ఎకరాల బంజరుభూమి అవసరమవుతుంది. ఒక సీబీజీ ప్లాంటు నెలకొల్పడానికి రిలయన్స్ బయో ఎనర్జీ సంస్థ రూ.130 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇందులో ప్లాంటు ఏర్పాటుకు రూ.105 కోట్లు, సమీప బంజరుభూముల పునరుజ్జీవనానికి రూ.25కోట్లు వెచ్చిస్తుంది. ప్రతి సీబీజీ ప్లాంటు ఏటా 7,800 మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ తో పాటు 22వేల మెట్రిక్ టన్నుల హైక్వాలిటీ ఫెర్మినేటెడ్ మాన్యూర్‌ను ఉత్పత్తిచేస్తుంది. దీనిద్వారా 3వేల ఎకరాల భూమిని సారవంతంగా మార్చవచ్చు.

### సారవంతంగా నిరర్థక భూములు

రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.5 లక్షల బంజరుభూముల్లో హైబ్రిడ్ నేపియర్ గ్రాస్, ఇతర ఎనర్జీ పంటలను పెంచడం ద్వారా ఇంటిగ్రేటెడ్ సీబీజీ ప్లాంట్లను నెలకొల్పాలని రిలయన్స్ సంస్థ నిర్ణయించింది. సీబీజీ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఫెర్టిలైజర్‌ను ఉపయోగించి నిరర్థక భూములను ఉత్పాదక భూములుగా మారుస్తారు. దీనిద్వారా ప్లాంట్లు నెలకొల్పే ప్రాంతాల్లో యువతకు ఉపాధి లభిస్తుంది. రిలయన్స్ సీబీజీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మెరుగవుతాయి. సీబీజీ ప్లాంట్‌లకు సమీపంలో ఉత్పత్తి అయ్యే సేంద్రియ ఎరువుతో సమీప ప్రాంత నిరర్థక భూములను సారవంతంగా మార్చడానికి ఆస్కారమేర్పడుతుంది. భారత్‌లో 13 కేటగిరిలకు చెందిన 160 మిలియన్ ఎకరాల బంజరుభూమి ఉండగా, వాతావరణంలో మార్పుల కారణంగా ప్రతిఏటా నిరర్థక భూమి విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. దేశంలోని మొత్తం బంజరు భూమిలో 50శాతం భూమి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనే ఉంది. సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున పారిశ్రామికీకరణ జరిగి జీడీపీ వృద్ధి చెందుతుంది. అన్ని సీబీజీ ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభమైతే రోజుకు 9.75 లక్షల ఎల్‌సీవీలను నింపుతుంది. ఇది మొత్తం ఇంధన అవసరాల్లో 5శాతాన్ని భర్తీ చేస్తుంది. సీబీజీ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే 110లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు ద్వారా 15లక్షల ఎకరాల భూములను సారవంతంగా మార్చేందుకు ఉపకరిస్తుంది.

# పేదలకు 'పట్టా'భిషేకం

- పేదరిక నిర్మూలన దిశగా మంత్రి నారా లోకేష్ అడుగులు
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అమలు చేస్తున్న లోకేష్
- నెరవేరుతున్న మంగళగిరి పేదల దశాబ్దాల కల
- మొదటిదశలో మూడు వేల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం
- మన ఇల్లు - మన లోకేష్ పేరుతో రేపటి నుండి పట్టాల పంపిణీకి శ్రీకారం
- 4 నుండి 12 వరకు నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు పట్టాలు అందివ్వనున్న మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): మంత్రి లోకేష్ హామీ ఇస్తే నెరవేరినట్టే.. మంగళగిరి పేద ప్రజల కల నెరవేరబోతోంది. ఎంతో మంది నాయకులు హామీ ఇచ్చారు, కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేస్తూ నారా లోకేష్ అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు అందజేసి మంగళగిరి పేద ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 91,413 ఓట్ల భారీ మెజారిటీతో మంగళగిరి ప్రజలు నారా లోకేష్ ను గెలిపించారు. గెలిచిన మొదటి రోజు నుండే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దశగా లోకేష్ కార్యాచరణ మొదలు పెట్టారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలి పోయిన సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో పనిచేస్తున్నారు. ఎన్నికల ముందు లోకేష్ ఇచ్చిన హామీల్లో ప్రధానమైంది ఇళ్ల పట్టాల సమస్య. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. వారంతా తాము నివసిస్తున్న భూమిని, రెక్కల కష్టంతో నిర్మించుకున్న గూడుని క్రమబద్దీకరించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంతోమంది నాయకులు వారిసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందినా ఆ హామీ అమలుకు కనీస కృషి చేసింది లేదు.



### నారా లోకేష్ చిత్తశుద్ధి..

కానీ ఇప్పుడు పరిస్థితి మారింది మంగళగిరి శాసనసభ్యుడిగా నారా లోకేష్ పేదల పట్ల తనకు ఉన్న చిత్తశుద్ధిని కార్యాచరణలో పెట్టారు. గత పది నెలల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రజల వివరాల సేకరణ దగ్గర నుండి వివిధ శాఖలతో సమన్వయం, పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులే ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు నింపడం వరకూ అన్నీ దశలను నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షించారు. అత్యంత క్లిష్టమైన అటవీ భూములు, రైల్వే భూముల సమస్యను కూడా పట్టుదలగా తీసుకుని పరిష్కారంవైపు అడుగులు వేస్తున్నారు. మొదటి దశలో 3వేల ఇళ్ల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం చేసారు నారా లోకేష్. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారి భూమిని, వారు నిర్మించుకున్న ఇంటిని క్రమబద్దీకరించి శాశ్వత హక్కు కల్పిస్తూ ఇంటి పట్టాలు అందజేయనున్నారు. పట్టాల పంపిణీతో పేదలకు భరోసా లభించనుంది. ఏప్రిల్ 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో అందజేయనున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 4 తేదీ నుండి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్‌ను అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న వేదికపై లబ్ధిదారులకు నారా లోకేష్ ఇళ్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 4న యర్రబాలెం, నీరుకొండ, కాజా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి లోకేష్ పట్టాలు అందజేస్తారు. ఏప్రిల్ 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు, ఏప్రిల్ 8న రత్నాల చెరువు, మహానాడు-2 కు చెందిన లబ్ధిదారులకు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబ్ధిదారులకు, ఏప్రిల్ 12న మహానాడు-1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు, మొత్తంగా మూడువేలకు పైగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్యనాయకులు, నారా లోకేష్ భారీ విజయానికి కృషి చేసిన ఆయా గ్రామాల, వార్డుల ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.



# ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కదిలిన ఎన్టీఆర్

## 43ఏళ్ల టీడీపీ ఉజ్వల చరిత్ర -గుణపాఠాలు 3



-గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### ఎమ్మెల్యేల మైసూరు క్యాంప్ - ఐబి కుట్రలను ఓడించిన చంద్రబాబు

- అసెంబ్లీ సమావేశం సెప్టెంబర్ 11న జరిగే విధంగా గవర్నర్ ఆదేశించారు. ఈలోపు అధికార బలంతో, ధనబలంతో టీడీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని కుట్రలు పన్నారు.
- ఈ కుట్రల్ని పటాపంచలు చేయడానికి కర్నాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డేను సంప్రదించి మొదటి బ్యాచ్‌లో 126మంది ఎమ్మెల్యేలను స్పెషల్ ఫ్లైట్‌లో బెంగుళూరుకు ఆగస్టు 23న తరలించారు.
- తరువాత నంది హిల్స్‌కు మార్చారు. అక్కడ వాతావరణం ఎక్కువ చలివున్నందున వారిని తిరిగి మైసూర్ దాస్ ప్రకాష్ పారడైజ్ హోటల్‌కు ఎమ్మెల్యే క్యాంపును మార్చడమైనది.
- 2 సెప్టెంబర్ 1984న ఎన్టీఆర్ మైసూరువచ్చి మెజారిటీ ఎమ్మెల్యేలతో గ్రూప్ ఫోటో దిగారు. అది దేశవ్యాప్తంగా పత్రికల్లో ప్రచురితమైంది.
- ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కేంద్ర ఐబి డిపార్టుమెంట్ దాస్ ప్రకాష్ హోటల్ చేరారు.
- ఐబి వలలో చిక్కకుండా ఎమ్మెల్యేలందరినీ చక్కగా సమన్వయ పరిచి ఐబి కుట్రల్ని చంద్రబాబు ఓడించారు.

### రాష్ట్రపతి బంగ్లాలో మెజారిటీ ఎమ్మెల్యేల పెరేడ్

- ఎమ్మెల్యేలతోపాటు ఎన్టీఆర్ కలవడానికి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ 20 ఆగస్టు 1984న అపాయింట్‌మెంట్ ఇచ్చారు.
- ఢిల్లీ వెళ్లడానికి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో మూడు బోగీలు రిజర్వు చేసుకోగా.. ఒక బోగీ మాత్రమే కేటాయించారు. ఢిల్లీ వెళ్లబోయే ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేయడానకి రౌడీ మూకలను సైతం పురికొల్పారు. అన్ రిజ్వర్డు బోగీల్లో కూడా ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరారు.
- కావాలని 11 గంటలు ఆలస్యంగా ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను ఢిల్లీ చేర్చారు. 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఉండగా ట్రైన్ సాయంత్రం 6.10 గంటలకు ఢిల్లీ రైల్వే స్టేషన్‌కు చేరుకొన్నది.
- రాష్ట్రపతి పెద్ద మనస్సుతో అపాయింట్‌మెంట్ 21 ఆగస్టు 1984కు రీ షెడ్యూల్ చేశారు.
- వీల్‌చైర్‌లోవున్న ఎన్టీఆర్‌తోపాటు 161మంది ఎమ్మెల్యేలు రాష్ట్రపతి భవన్‌కు చేరుకొన్నారు. ఈ దృశ్యాన్ని చిత్రీకరించుటకు 21 విదేశీ ఛానళ్లు సైతం ఢిల్లీ చేరాయి.
- రాష్ట్రపతి భవన్‌లోకి ప్రవేశించేందుకు ఐబి పోలీసులు ఎమ్మెల్యేల ఐడెంటిటీ కార్డులు ఒకటి రెండుసార్లు తనిఖీ చేశారు. ఐబి తనిఖీల్లో కూడా 161 ఎమ్మెల్యేల లిస్టు వచ్చింది.
- అనంతరం జైల్‌సింగ్ ఇందిరాగాంధీకి ఫోన్ చేసి ఎన్టీఆర్‌కు జరిగిన అన్యాయం గురించి చెప్పారు. ఐబి ద్వారా ఎన్టీఆర్‌కు మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు గురించి తెలుసుకోమని కోరారు.
- 22 ఆగస్టు సాయంత్రం ఇందిరాగాంధీ రాష్ట్రపతిని కలుసుకొన్నది.
- 20 ఆగస్టు 1984 ఢిల్లీ జాతీయ ప్రతిపక్షాలు ఎన్టీఆర్‌కు మద్దతుగా సమావేశమయ్యాయి. చరణ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జగ్జీవన్‌రాం, చంద్రశేఖర్, వాజ్‌పేయ్, చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, శరద్‌పవార్, త్రిదీప్ చౌదరి (ఆర్.ఎస్.పి), చిత్త బసు (ఎఫ్.బి), బీసీ కాంబ్లే పాల్గొన్నారు. విమానాల ఆలస్యంవల్ల ఎన్టీఆర్, హెగ్డే ఈ సమావేశంలో పాల్గొన లేకపోయారు.
- 21 ఆగస్టు 1984న పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు రాంలాల్ చేత రాజీనామా చేయించాలి. లేదంటే ఇందిరాగాంధీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.
- 25 ఆగస్టు 1984న జాతీయ ప్రతిపక్షాలు భారత్ బంద్ నిర్వహించాయి. ఇందిరాగాంధీ ప్రతిష్ట మసక బారింది.
- రాష్ట్రపతిని కలిసిన తరువాత ఎమ్మెల్యేల రక్షణకు వారిని బెంగుళూరు తరలించాలని నిర్ణయించడమైంది. ఇందిరాగాంధీ ప్రతిష్టను కాపాడుకొనేందుకు రాంలాల్‌ను బలి పశువు చేస్తూ అతనిచే 24 ఆగస్టు 1984న రాజీనామా చేయించారు.

### చైతన్య రథయాత్ర తిరిగి ప్రారంభించిన ఎన్టీఆర్

- ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్టీఆర్ చైతన్యరథంపై తిరిగి యాత్ర ప్రారంభించారు. 25.08.1984న విజయవాడలో ప్రారంభ సభ అదిరిపోయింది. ఇందులో జాతీయ నాయకులు కూడా పాల్గొన్నారు.
- ఆగస్టు 26న గుంటూరులో, 27న తెనాలిలో, 28న ఒంగోలులో జరిగిన సభలు కిక్కిరిసిపోయాయి. ఇలా రాష్ట్రంలో జరిగిన సభలన్నీ దిగ్విజయమయ్యాయి.

### బలపరీక్ష నిర్వహణకు సెప్టెంబర్ 11న జరిగే అసెంబ్లీ సమావేశాల అడ్డుకు కుట్ర

- అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేయమని నాదెండ్ల కొత్త గవర్నర్ శంకర్ దయాల్ శర్మను కోరారు. అందుకు ఆయన అంగీకరించనందున విశ్వాస పరీక్షకు సెప్టెంబర్ 11వ తేది నిర్ణయమైంది.
- బాగారెడ్డి ప్రొటెం స్పీకర్‌గా నియమించబడ్డారు.
- హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితి సృష్టించారు. సెప్టెంబర్ 7న బక్రీద్. సెప్టెంబర్ 9న వినాయక నిమజ్జనం. సెప్టెంబర్ 11న అసెంబ్లీ సమావేశాలు.
- వినాయక నిమజ్జనం రోజున బషీర్‌బాగ్‌లో ఒక ఖాదీ వస్త్ర షాపును దగ్ధం చేశారు. ఆ పేరుతో కర్ఫ్యూ విధించారు.
- కర్నాటక నుండి నాలుగు బస్సుల్లో వచ్చే టీడీపీ ఎమ్మెల్యేలను మహబూబ్‌నగర్‌లో పోలీసులతో అడ్డగించి కొందరు ఎమ్మెల్యేలను కిడ్నాప్‌చేసి దాచి వేయాలని కుట్ర చేశారు.
- జాతీయ ప్రతిపక్షాలు, మీడియా ఉన్నందున ఆ కుట్ర పారలేదు.
- ఎమ్మెల్యేలు కర్ఫ్యూ పాస్‌లు తీసుకొని క్షేమంగా రామకృష్ణా స్టూడియోకు చేరుకున్నారు. ఎమ్మెల్యేల రక్షణకు పార్టీ నేతలతో పెట్రోలింగ్ టీంలు ఏర్పాటు చేశారు.
- అసెంబ్లీ సమావేశాలు 11 సెప్టెంబర్ 1984 ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో మైకులు విరగొట్టి అరాచకం సృష్టించారు. ఆ సాకుతో 12వ తేదీకి వాయిదా వేశారు.
- 12వ తేదీ అసెంబ్లీలో కూడా అరాచకం సృష్టించారు. నాటు బాంబు కూడా అసెంబ్లీలో విసిరారు. అయితే అది పేలలేదు. తేదీ ప్రకటించకుండా స్పీకర్ అసెంబ్లీని వాయిదా వేశారు. దీనికి నిరసనగా ఎన్టీఆర్‌తో సహా టీడీపీ ఎమ్మెల్యేలు అక్కడే నిరసన ధర్నా చేశారు. విద్రోహ ఎమ్మెల్యేలు ఎన్టీఆర్‌పై బూతుల దాడి చేశారు.
- ఈ దుర్మార్గులకు వ్యతిరేకంగా ఎన్టీఆర్‌తో సహా 162మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. విశ్వాస పరీక్షను అడ్డుకొనేందుకే అసెంబ్లీని అడ్డుకొంటున్న వైనం వారి దృష్టికి తెచ్చారు.
- 13వ తేదీ కూడ అసెంబ్లీని నడవనీయ లేదు. స్పీకర్ బాగారెడ్డి గుండె నొప్పి అని ఆసుపత్రికి వెళ్ళాడు. ఓవైసీని ప్రొటెం స్పీకర్ చేశారు. ఫలితం లేదు.
- అసెంబ్లీకి ఎమ్మెల్యేలు కలిసికట్టుగా రావడం, కలిసికట్టుగా తిరిగి వెళ్లే విధంగా చంద్రబాబు వ్యూహరచన చేశారు. ఒక్క ఎమ్మెల్యేను కూడా లాక్కోలేకపోయారు.
- సెప్టెంబర్ 20న అసెంబ్లీ సమావేశాలు జరుపుతామని ప్రొటెం స్పీకర్ ఓవైసీ ప్రకటన జారీ చేశారు.
- విశ్వాస పరీక్ష జరగకుండా అడ్డుకొనేందుకే అసెంబ్లీ సమావేశాలు వాయిదాలు వేస్తున్న కుట్రల్ని 162మంది ఎమ్మెల్యేల సంతకాలతో గవర్నర్‌కు నివేదించారు.
- సెప్టెంబర్ 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ బంద్ నిర్వహించారు.
- ఢిల్లీ జాతీయ ప్రతిపక్షాలు రాష్ట్రపతికి పరిస్థితిని వివరించారు. ఇందిరాగాంధీ ఇంటి ముందు ధర్నా నిర్వహించాలని, 20వ తేదీన భారత్ బంద్ నిర్వహించాలని జాతీయ ప్రతిపక్షాలు నిర్ణయించాయి.
- రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్, హోంమంత్రి పీవీ నరసింహారావును పిలిచి తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.
- సెప్టెంబర్ 16వ తేదీన గవర్నర్ శంకర్ దయాల్ శర్మ నాదెండ్లను పిలిచి రాజీనామా చేయమని కోరారు. గవర్నర్ పాలన కోరిన నాదెండ్ల కోరికను గవర్నర్ తిరస్కరించారు.
- 16 సెప్టెంబర్ 1984 ఉదయం 11.30 గంటల ప్రాంతంలో నాదెండ్ల సీఎం పదవికి రాజీనామా ఇచ్చారు.
- 12 గంటలకు రాజ్‌భవన్ నుండి రామకృష్ణా స్టూడియోకు ఫోన్ చేశారు. 12.15 గంటలకు ఎన్టీఆర్ గవర్నర్‌ను కలిశారు. 45 నిమిషాల తరువాత గవర్నర్ బంగ్లానుండి వెలుపలకు వచ్చిన ఎన్టీఆర్ తన ప్రభుత్వం ఏర్పాటు చేయమని గవర్నర్ ఇచ్చిన ఆహ్వానాన్ని తన మద్దతుదార్లకు చెప్పారు.
- హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. 1.10 గంటలకు రేడియో ప్రసారాలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా బాణాసంచా పేలింది.
- 16 సెప్టెంబర్ 1984న మధ్యాహ్నం 3.48 గంటలకు ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.
- స్వాతంత్రానంతరం తొలగింపబడిన ముఖ్యమంత్రి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఎన్టీఆర్ ఒక్కరికే సాధ్యమైంది.

### ఇందుకు కారణాలు

1. ఏడాదిన్నర పాలనలో ఎన్టీఆర్ ప్రభుత్వం చేసిన ప్రజానుకూల నిర్ణయాలవల్ల గ్రామీణ ప్రజలు, పట్టణ పేదలు ఎన్టీఆర్‌కు అండగా గట్టి పోరాటాలు చేశారు.
2. కాంగ్రెస్ నియంత పోకడల్ని జాతీయ, రాష్ట్ర ప్రతిపక్షాలు గట్టిగా ఎదిరించాయి.
3. ప్రజాస్వామ్య మీడియా దృఢంగా నిలబడింది.
4. కొందరు ద్రోహం చేసినా మెజారిటీ ఎమ్మెల్యేలు మద్దతుగా నిలబడ్డారు.
5. ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమాన్ని ఎమ్మెల్యేల క్యాంపును కంటికి రెప్పలా చంద్రబాబు నాయుడు రక్షించారు. చక్కని సమన్వయం చేశారు. పొలిటికల్ మరియు ఆర్గనైజేషనల్ వ్యూహకర్తగా అందరి ప్రసంశలందుకొన్నారు.

### గుణపాఠాలు

1. మంచి నిర్ణయాలైనా తగు గ్రౌండ్ వర్క్ చేయకుండా తొందరపడి నిర్ణయాలు చేసి అమలు చేస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందని స్పష్టమౌతున్నది.
2. పరిమిత సెక్షన్లల్లో వ్యక్తమైన అసంతృప్తిని అతిగా అంచనా వేసి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తమ ఢిల్లీ నేతల్ని తప్పుదారి పట్టించారని వెల్లడి అయ్యింది.
3. భిన్నాభిప్రాయాన్ని సహించలేక నియంతృత్వ పోకడలకుపోయి ఇందిరాగాంధీ అప్రతిష్టపాలైంది.
4. ఏపి ఇంటెలిజెన్స్ సకాలంలో నాదెండ్ల కుట్రల్ని గమనించి సీఎంకు చేరవేయడంలో విఫలమైంది. పొలిటికల్ ఇంటెలిజెన్సు కూడా సరిగా లేదని స్పష్టమైంది.

> **ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్టీఆర్ చైతన్యరథంపై తిరిగి యాత్ర ప్రారంభించారు. 25.08.1984న విజయవాడలో ప్రారంభ సభ అదిరిపోయింది. ఇందులో జాతీయ నాయకులు కూడా పాల్గొన్నారు. ఆగస్టు 26న గుంటూరులో, 27న తెనాలిలో, 28న ఒంగోలులో జరిగిన సభలు కిక్కిరిసిపోయాయి. ఇలా రాష్ట్రంలో జరిగిన సభలన్నీ దిగ్విజయమయ్యాయి.**



ప్రజాస్వామ్య పునరుద్ధరణ కాంక్షిస్తూ.. కాంగ్రెస్ నీచ రాజకీయాలను ప్రజాకోర్టుకు తీసుకెళ్లడంలో భాగంగా ఆగస్టు 30, 1984న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో నిర్వహించిన బహిరంగ సభలో "చైతన్యరథం" నుంచి ప్రసంగిస్తున్న ఎన్టీ రామారావు.

# నా చేతులతో పింఛను ఇవ్వడం నాకెంతో సంతృప్తినిస్తోంది: చంద్రబాబు



అమరావతి(చైతన్య రథం): 'పేదవ సేవలో' పేరిట నిర్వహిస్తోన్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు స్వయంగా నా చేతులతో లబ్ధిదారులకు అందించడం చాలా సంతృప్తినిస్తోంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగానే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలు సాదకబాధకాలు తెలుసుకునే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'ఈరోజు బాపట్లజిల్లా పర్చూరు నియోజకవర్గంలో 'పేదల సేవలో పేరిట నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నాను. పేదల పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.33,100కోట్లు ఖర్చు చేస్తూ...ప్రతి నెలా 63లక్షల మందికి 28రకాల పింఛన్లు ఇస్తున్నాం. మరే రాష్ట్రంలోనూ ఇంతమొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు. అందుకే ఏపీలో పింఛన్ల పంపిణీ దేశంలోనే అతి పెద్ద సంక్షేమ కార్యక్రమంగా నిలుస్తోంది.


పేదలకు భరోసా ఇచ్చే కార్యక్రమంలో స్వయంగా పాల్గొని పింఛను ఇవ్వడం నాకు ఎంతో సంతృప్తిని ఇస్తోంది. అందుకే ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నాను.ప్రజల స్థితిగతులు, సాధక బాధకాలు తెలుసుకుంటున్నాను. ఇందులో భాగంగా మంగళవారం చినగంజాం మండలం, పెదగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెంలో మానసిక దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి ఇంటికి వెళ్లి పింఛన్ అందించాను. సుభాషిణి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతోపాటు, ఆమె తల్లికి ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించాను. బాగా చదివి పోలీస్ అవ్వాలను కుంటున్న సుభాషిణి చెల్లెలు భరణిని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చేర్పించాలని అధికారులకు సూచించాను.

అలాగే మరో లబ్దిదారు బత్తుల జాలమ్మ ఇంటికి వెళ్లి వితంతు పెన్షన్ అందించాను.శిథిలావస్థలో ఉన్న జాలమ్మ ఇంటిని చూసి తీవ్ర ఆవేదన చెందాను. వెంటనే ఆమెకు గృహంతోపాటు వంట గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వమని అధికారులకు సూచించాను. అలాగే ఆమె కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేయమని చెప్పాను.

అనంతరం ప్రజావేదిక సభలో పాల్గొన్నాను. పీ-4 కార్యక్రమంలో భాగంగా పేదకుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు విక్రమ్ నారాయణ రావు, వసంత శ్రీనివాసరావు అనే మార్గదర్శకులు చెరొక 15 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటామని ముందుకు వచ్చారు. వారికి నా అభినందనలు.

పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభ్యర్థన మేరకు షిప్ బిల్డింగ్, షిప్ రిపేరింగ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చాను' అని పేర్కొన్నారు.

# పీ-4 అంటే జగన్ ముఠాకు వణుకెందుకు?




- **పేదల్ని నిరుపేదలుగా చేసిన జగన్ పాలన**
- **పేదల్ని సొంతకాళ్లపై నిలబెట్టిన చంద్రన్న పాలన**

అమరావతి (చైతన్య రథం): ఉగాది రోజున చంద్రబాబు ప్రభుత్వం పీ-4 జీరో పావర్టీ విధానం ప్రకటించింది. మార్గదర్శి- బంగారు కుటుంబం పేరు వినగానే జగన్ ముఠాకు వణుకుపుడుతుంది. పీ-4కు దురుద్దేశాలు అంటగడుతున్నారు. పేదరికం లేని సమాజం అసంభవమని తీర్పులిస్తున్నారు, హేళనలు చేస్తున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం డ్వాక్రా మహిళల్ని వ్యాపారవేత్తలు చేస్తామని ప్రకటించినప్పుడు కూడా ఆడవాళ్లను చెడగొడుతున్నారని నిందలు వేశారు. డ్వాక్రా సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా రాష్ట్రంలో నేడు దాదాపు కోటి కుటుంబాలు సొంత కాళ్లపై నిలబడ్డాయి. నేడు పురుషులు కూడా తమకు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు పెట్టమని కోరుతున్నారంటే.. డ్వాక్రా ఎంత విజయం సాధించిందో అర్థమవుతున్నది. ఏడాదికి రూ.60వేల కోట్లు బ్యాంకు లావాదేవీలు జరిపే స్థాయికి మహిళా గ్రూపులు వచ్చాయి. డ్వాక్రాపై ఆనాడు జగన్ తండ్రి ముఠా హేళన చేసింది. నిజాయితీపరులైతే ఇప్పుడు చెంపలు వేసుకోవాలి.

అలాగే హైటెక్ సిటీ నిర్మిస్తుంటే 'కంప్యూటర్లు కూడు పెడతాయా?' అని హేళన చేశారు. తమ భూములకు విలువ పెంచుకోవడానికే చంద్రబాబు హైటెక్ సిటీ నిర్మిస్తున్నారని నిందలు వేశారు. జగన్‌రెడ్డికే హైదరాబాద్‌లో ఎక్కువ ఆస్తులు ఉన్నాయన్నది వాస్తవం. హైటెక్ సిటీ సైబరాబాద్‌ను సృష్టించి.. సైబరాబాద్ ఉమ్మడి రాష్ట్రంలోని 294 నియోజకవర్గాల యువతకు, రైతు, రైతుకూలీల బిడ్డలు 30 లక్షలమందికి ఉపాధి కల్పించింది. పేదల్ని సొంతకాళ్లపై నిలబెట్టింది.

పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్‌లో నెల్లూరు-చెన్నై జాతీయ రహదారి నిర్మాణం చేస్తుంటే.. ప్రభుత్వ రోడ్లు ప్రయివేట్‌కు ధారాదత్తం చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. జాతీయ రహదారుల వల్ల నేడు ప్రయాణకాలం, డీజిల్ పెట్రోలు ఎలా ఆదా అవుతున్నదో ప్రజలు అనుభవిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి, పోలవరం, నదుల అనుసంధానాన్ని గండికొట్టారు. నాడు నికర జలాలా? వరద జలాలా? అంటూ కుతంత్రం లేదదీసి తెలుగుగంగపై రాద్ధాంతం చేశారు. పట్టిసీమను ఒట్టిసీమ అని హేళన చేశారు. ఆ పట్టిసీమవల్లే రాయలసీమకు అదనంగా నీళ్లివ్వగలుగుతున్నాము. ఇలా చంద్రబాబు ఏ మంచి పని తలపెట్టినా.. దానిపై నిందలు వేయడం, అడ్డుకోవడం పనిగా పెట్టుకున్నారు.

సబ్ ప్లాన్ నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీ డ్రైవర్లకు ఇన్నోవా కార్లిచ్చి వారిని ఓనర్లుగా చేయడమైంది. ఆదరణ ద్వారా బీసీ వృత్తిదారుల్ని తమ కాళ్లపై నిలబెట్టడమైంది. మద్యం షాపుల్లో 10శాతం గౌడవర్గానికి కేటాయించారు. విదేశీ విద్య ద్వారా వేలాదిమందిని అభివృద్ధి చేయడమైంది. నేడు సిడాప్ ద్వారా ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారు చేయాలన్న కృషి జరుగుతుంది. ప్రభుత్వ కృషితోపాటు సంపన్నుల తోడ్పాటుతో పీ-4 అమలుకు కృషి జరుగుతున్నది. ఇప్పటికే ఏడు లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి జరుగుతుంది. పీ-4 విధానం ద్వారా మార్గదర్శి-బంగారు కుటుంబం సాధించి స్వర్ణాంధ్ర-2047 సంకల్పం విజయవంతం చేయబడుతుంది. చంద్రబాబు ప్రభుత్వం పదికాలాలు కొనసాగితే ఇది సాధ్యమే.

జగన్ పేదల్ని నిరు పేదలుగా చేశారు. అమ్మఒడికి రూ.13వేలు ఇచ్చి.. నాన్న బుడ్డిలో లక్ష కొట్టేశారు. వాహనమిత్ర అంటూ రూ.10వేలిచ్చి.. రెండోవైపు డీజిల్, పెట్రోల్, పోలీస్ జరిమానాలు పెంచి లక్ష కొట్టేశారు. నాసిరకం మద్యంపోసి 35 లక్షలమంది పేదల ఆరోగ్యాల్ని పాడుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు ఒక లక్ష కోట్లు దారిమళ్లించారు. పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కబ్జాలు చేశారు. పేదలు సొంతకాళ్లపై నిలబడే విదేశీ విద్యలాంటి పథకాలు రద్దు చేశారు. పేదల్ని బిచ్చగాళ్లుగా చేసి ఓటు బ్యాంకుగానే భావించాడు జగన్. పీ-4 విజయవంతమైతే పునాది బద్దలవుతుందని జగన్ ముఠా మార్గదర్శి-బంగారు కుటుంబంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

- గురజాల మాల్యాద్రి,
**చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

### నేడు లోక్‌సభ ముందుకు

# వక్ఫ్ సవరణ బిల్లు

## - సభ్యులకు విప్ జారీ చేసిన బీజేపీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బావిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు బుధవారం పార్లమెంటు ముందుకు రాబోతోంది. ఈ బిల్లుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఉభయ సభల ఆమోదం లభించేలా చూసేందుకు అధికార పార్టీ పట్టుదలగా ఉండటం, దీనిని పలు కారణాలతో విపక్షాలు విభేదిస్తున్న క్రమంలో బిల్లును ఈ నెల 2న లోక్‌సభలో ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

స్పీకర్ దీనిపై చర్చకు 8 గంటలు కేటాయించాలని నిర్ణయించారు. అనంతరం ఓటింగ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు బీజేపీ మూడులైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా బుధవారం తప్పనిసరిగా సభకు హాజరుకావాలని, రోజంతా ఉండాలని, ప్రభుత్వ వైఖరికి బాసటగా నిలడాలని పార్టీ ఎంపీలను బీజేపీ కోరింది.

కాగా, వక్ఫ్ బిల్లుపై చర్చా సమయం, పార్టీలకు సంఖ్యాబలం ఆధారంగా సమయం కేటాయింపుపై చర్చించేందుకు బీఏసీ సమావేశం నిర్వహించారు. బిల్లుపై చర్చకు 8 గంటలు కేటాయించాలని బీఏసీలో నిర్ణయించారు. అయితే 12 గంటల సేపు చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనిపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం నుంచి విపక్షాలు వాకౌట్ చేశాయి.

### పొడిగించే అవకాశం కూడా ఉంది: రిజిజు

వక్ఫ్ సవరణ బిల్లు-2024ను బుధవారం ప్రశ్నోత్తరాల సమయం అనంతరం లోక్‌సభలో ప్రవేశపెడతారని, దీనిపై 8 గంటలసేపు చర్చ జరపాలని బీఏసీ సమావేశం నిర్ణయించిందని, అవసరాన్ని బట్టి సమయం పొడిగించే వీలుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

సభలో చర్చను తాము కోరుకుంటున్నామని, ప్రతి రాజకీయ పార్టీకి తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంటుందని, సవరణ బిల్లుపై ఏ పార్టీ ఎలాంటి వైఖరి తీసుకుందో ప్రజలు కూడా తెలుసుకోవాలని అనుకుంటారని చెప్పారు.

# వక్ఫ్ బిల్లుపై ముస్లింకు అండగా టీడీపీ

- జేపీసీ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి
- ముస్లిం సమాజంతో విస్తృతంగా చర్చలు
- జేపీసీ ముందుకు నాలుగు సవరణలు
- మూడింటికి ఆమోదం
- ముస్లింల అభిప్రాయాలు పట్టించుకోకుండా జగన్ ద్రోహం



అమరావతి (చైతన్యరథం): వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో టీడీపీ మరోసారి ముస్లింల పక్షాన గట్టిగా నిలబడింది. వక్ఫ్ బిల్లు సెలెక్ట్ కమిటీకి వెళ్లి, సవరణలు చేసేలా పట్టుబట్టి, ముస్లింల పక్షాన పోరాడింది. టీడీపీ పట్టువల్లే దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుకు కేంద్రం ఆంగీకరించింది. ఎన్డీఏలో ఉంటూనే ముస్లింల హక్కుల కోసం టీడీపీ పోరాడి సాధించింది. వక్ఫ్ చట్టంలో టీడీపీ ప్రవేశపెట్టిన నాలుగు సవరణల్లో, మూడింటికి జేపీసీ ఆమోదం తెలిపింది. జేపీసీ ఆమోదించిన 14 సవరణల్లో 3 టీడీపీ సూచించినవే కావటం గమనార్హం. టీడీపీ ప్రతిపాదించిన సవరణలు ఇవీ...

**1. కొత్త చట్టం అమల్లోకి రావడానికి ముందున్న వక్ఫ్ ఆస్తులు యథాతథం**

'వాడుక ద్వారా వక్ఫ్"గా ఇప్పటికే నమోదైన ప్రస్తుత వక్ఫ్ ఆస్తుల కేసులు తిరిగి తెరిచేందుకు వీలు లేదు. వాటికి వక్ఫ్ దస్తావేజు లేనప్పటికీ, వక్ఫ్ ఆస్తులుగానే ఉంటాయి. మొత్తం వక్ఫ్ ఆస్తుల్లో దాదాపు 40 నుండి 50 శాతం వరకు వాడుక ద్వారా వక్ఫ్ కేటగిరీలోకి వస్తాయి. అనేక మసీదులు, శ్మశానవాటికలు, అషూర్-ఖానాలు, దర్గాలు, ఈద్గాలు మొదలైనవి అనాదిగా మతపరమైన ప్రయోజనాల కోసం వినియోగంలో ఉన్నాయి. ఈ సంస్థలు, వాటి ఆస్తులు వాడుక ద్వారా వక్ఫ్ పరిధిలోకి వస్తాయి. వాటిలో చాలా వాటికి వక్ఫ్ దస్తావేజులు లేవు.

**2. వివాదాలపై విచారణ అధికారిగా కలెక్టరు వద్దు. ప్రభుత్వం నియమించిన డిజిగ్నేటెడ్ అధికారికి ఇవ్వాలి.**

ఏదైనా ఆస్తిపై వివాదం వస్తే దానిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. ప్రస్తుతం అనేక వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. భవిష్యత్తులో కూడా ఒక నిర్దిష్ట ఆస్తి వక్ఫ్‌కు చెందినదా, ప్రభుత్వానికి చెందినదా అనే వివాదాలు తలెత్తవచ్చు. దానిపై నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉండకూడదని టీడీపీ ప్రతిపాదించింది. వివాదంపై విచారణకు అధికారిని నియమించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వదిలివేయాలని సూచించిన సవరణకు జేపీసీ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా కలెక్టర్ స్థాయికి మించిన అధికారిని నియమించవచ్చు.

**3. డిజిటల్‌గా పత్రాలను సమర్పించడానికి 6 నెలల గడువు నిబంధన తొలగింపు. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అధికారిక పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల వివరాలను నమోదు చేయడానికి 6 నెలలు కాకుండా తగినంత సమయం ఇవ్వాలి.**

ప్రతిపాదిత చట్టం ప్రకారం ఇది అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లోపు వక్ఫ్ ఆస్తుల వివరాలు అధికారిక పోర్టల్లో నమోదు చేయాలి. ఆ గడువు లోపు నమోదు కాని ఆస్తుల గురించి ఏ కోర్టులోనూ దావా వేసేందుకు, అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉండదు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉండదు. దీనిని టీడీపీ వ్యతిరేకించి ఈ గడువు నిబంధన తీసేయాలని పట్టుబట్టింది. ఈ సవరణకు జేపీసీ ఆమోదం తెలిపింది. తగిన కారణం ఉందని కోర్టుకు ఆమోదయోగ్యంగా తెలియపరిస్తే, ఆరు నెలల గడువు తర్వాత కూడా దావా, అప్పీల్, ఇతర చట్టపరమైన చర్యలకు సంబంధించి దరఖాస్తును కోర్టు స్వీకరించవచ్చు. ఈ సవరణతో, వక్ఫ్ ఆస్తుల నమోదును పూర్తి చేయడానికి ఆరు నెలల కంటే ఎక్కువ ఆలస్యం జరిగితే సరిదిద్దుకునేందుకు సంబంధించిన వారికి/సంస్థలకు తగిన సమయం ఇస్తారు.

## టీడీపీ వల్లే జేపీసీ ఏర్పాటు

వక్ఫ్ సవరణ చట్టంపై టీడీపీ మొదటినుంచీ ముస్లింలకు మద్దతుగా నిలిచింది. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రతిపాదిత ఈ సవరణ బిల్లులోని లోపాలను వ్యతిరేకించింది. ముస్లిం సమాజం మనోభావాలను గౌరవిస్తూ, వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ జరగాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ కోరింది. టీడీపీ డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, జగదాంబికా పాల్ అధ్యక్షతన 31 మంది సభ్యులతో జేపీసీని ఏర్పాటు చేసింది. ఈ జేపీసీలో తెలుగు రాష్ట్రాల ప్రతినిధులుగా తెలంగాణ నుండి అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), డీకే అరుణ (బీజేపీ), ఆంధ్రప్రదేశ్ నుండి లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), విజయసాయి రెడ్డి (వైసీపీ) సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ వక్ఫ్‌కు సంబంధించిన 284 మందితో చర్చలు జరిపింది. ముంబై, అహ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, గౌహతి, భువనేశ్వర్, పాట్నా, కోల్‌కతా, లక్నో వంటి నగరాల్లో సమావేశం అయింది. మూడు అధ్యయన పర్యటనలు చేసింది. వక్ఫ్ బోర్డులు, ప్రభుత్వాలు, మైనారిటీ కమిషన్ల అభిప్రాయాలను సేకరించింది. జేపీసీ 38 సార్లు సమావేశమైంది. ఈ సమావేశాలకు అసదుద్దీన్ ఒవైసీ 14 సార్లు, డీకే అరుణ 12 సార్లు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు 11 సార్లు హాజరయ్యారు.

విజయసాయి రెడ్డి కేవలం 4 సమావేశాలకు మాత్రమే హాజరై, చివరి సమావేశానికి ముందే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ముస్లిం మైనారిటీల మనోభావాలను గౌరవిస్తూ, వక్ఫ్ బిల్లుపై వారి ఆందోళనలను తెలుసుకోవడానికి జేపీసీ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు దేశవ్యాప్తంగా విస్తృత సంప్రదింపులు జరిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి, రాష్ట్రంలోని మైనారిటీ పెద్దలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వక్ఫ్ హోదా, కలెక్టర్ అధికారాలు, వక్ఫ్ బోర్డు నిర్మాణం, ట్రిబ్యునల్ అధికారాలు వంటి కీలక అంశాలపై ముస్లిం మైనారిటీల ఆందోళనలను, మనోభావాలను జేపీసీ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రతినిధులతో కూడిన ఒక అధికారిక కమిటీని ఏర్పాటు చేసి, జేపీసీని కలిసి రాష్ట్రం తరపున పలు ముఖ్యమైన సవరణలను ప్రతిపాదించారు. జేపీసీ సభ్యులు గంటకు పైగా ముస్లిం పెద్దల అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 44 సవరణలు రాగా, వాటిలో 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నియమించిన కమిటీ ప్రతిపాదించిన 3 సవరణలను జేపీసీ ఆమోదించడం తెలుగుదేశం పార్టీ కృషికి తార్కాణం.

## వైసీపీ ద్రోహం

తెలుగు రాష్ట్రాల తరపున జేపీసీలో ప్రాతినిధ్యం వహించే అవకాశం వైసీపీకి వచ్చినా.. ముస్లింల అభిప్రాయాలను వినడానికి కూడా జగన్ ఇష్టపడలేదు. భయంతో, యలహంకలో తలదాచుకున్నారు. జేపీసీ సమావేశాలకు డుమ్మా కొడుతూ.. చివరి జేపీసీ సమావేశానికి ముందే విజయసాయి రెడ్డి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, ముస్లిం సమాజానికి ద్రోహం చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకూ ఏ ఒక్క సవరణ, డిమాండ్ చేయలేదనే విషయాన్ని ముస్లిం సమాజం తెలుసుకోవాలి.

ఈ మొత్తం వ్యవహారంలో, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ముస్లిం మైనారిటీల పక్షాన నిలబడి, వారి హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేసింది. ముస్లిం సమాజం పట్ల తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం.

---

# అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం

- కూటమి ప్రభుత్వంతో ప్రజలందరికీ మంచి జరుగుతుంది
- స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టీకరణ
- లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి



బాపట్ల (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరుగుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం భగవాన్ రాజుపాలెంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఉదయం సంక్షేమ పెన్షన్లను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాలనీలను సందర్శించిన ఆయన.., స్థానికులతో ముఖాముఖి సంభాషించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలతో పాటు పలు అంశాలను గ్రామస్థులను అడిగి తెలుసుకు న్నారు. లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న సందర్భంగా అనేక విషయాలను గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగుల పెన్షన్ పూర్తిస్థాయి లో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కొందరు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి గొట్టి పాటి.., సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అదే విధంగా కాలనీ సందర్శన సందర్భంగా భగవాన్ రాజు పాలెంలో కమ్యూనిటీ హాల్, డ్రైనేజీ కాలువల నిర్మా ణం చేయాలని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మరి కొందరు తమకు ఇంటి నిర్మాణంలో ఆర్థిక సహాయం చేయాలని కోరారు. గ్రామస్థుల వినతులపై మంత్రి గొట్టిపాటి సానుకూలంగా స్పందించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్న మంత్రి.. రాజుపాలెంలో కమ్యూనిటీ హాల్, డ్రైయిన్‌ల నిర్మాణాలు చేపట్టేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అధికారులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పేదరికంలేని రాష్ట్రమే లక్ష్యంగా అడుగులు
- పెన్షన్లను పెంచి మాట నిలుపుకున్నాం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



తాడేపల్లి(చైతన్యరథం): పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం 47వ డివిజన్ ఈడేపల్లిలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ.4000 పెన్షన్ అందిస్తున్నాం.

దివ్యాంగులకు రూ.6 వేలు, నూరు శాతం వైకల్యం కలిగిన వారికి రూ.15 వేల పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. రాష్ట్రంలో ప్రస్తుతం 64 లక్షల మందికి ప్రతి నెలా రూ.2722 కోట్లను పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. ఏటా పెన్షన్ల కోసమే ఏకంగా రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందనేందుకు పెన్షన్ల పంపిణీ నిదర్శనం. కృష్ణా జిల్లాలో 2,34,909 పెన్షన్లు ఉండగా, మచిలీపట్నంలో సుమారు 30 వేల పెన్షన్లు అందిస్తున్నాం. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం. పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు చేపట్టాం. తాజాగా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పీ4 కార్యక్ర మాన్ని రూపొందించాం.

పేదరికం అనేది లేని రాష్ట్రంగా ఏపీని మార్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వయం ఉపాధి ద్వారా యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

### కిడ్నీ బాధితుడికి రెండు నెలల పెన్షన్

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తాడేపల్లికి చెందిన ఉయ్యూరు వీరభద్రరావును మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పరామర్శించారు. పానీ పూరీ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని, కిడ్నీ వ్యాధి కారణంగా ఉపాధి కోల్పోయానని చెప్పగా వైద్యానికి అండగా నిలుస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పానీ పూరి బండి నడుపుతున్నప్పటికీ పిలలను ఉన్నత చదువులు చదివించడంపై అభినందించారు. పెద్ద కుమారుడు ఎంబీఏ చదువుతూ పానీ పూరీ బండి నడుపుతు న్నట్లు చెప్పడంతో వారికి మెరుగైన ఉద్యోగావకాశం కల్పించేలా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెండు నెలలకు సంబంధించి రూ.30 వేల పెన్షన్ మొత్తాన్ని వారికి అందజేశారు.

# ఇళ్ల నిర్మాణాలకు అదనంగా రూ.3,220 కోట్లు

- యూనిట్ విలువ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆదివాసీ లబ్ధిదారులకు మేలు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆదివాసీ గిరిజనులు ఇంటి నిర్మాణాల్లో పడుతున్న కష్టాలు, ఆర్థిఖ ఇబ్బందులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అసంపూర్తిగా ఉన్న 5.99 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు రూ.3,220 కోట్ల అదనపు ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం యూనిట్ విలువను కేవలం రూ.1.80 లక్షలుగా నిర్ణయించింది. గత ఐదేళ్లలో ఇంటి సామగ్రి, కూలీల ధరలు విపరీతంగా పెరిగినందున లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయటానికి అప్పులు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా ఇంటి యూనిట్ విలువకు అద నంగా ప్రతి షెడ్యుల్ కులాల వారికి రూ.50 వేలు, వెనకబడిన తరగతుల వారికి రూ.50 వేలు, షెడ్యూలు తెగల వారికి రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులు (పీవీటీజీ)కు రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఈ అదనపు ఆర్థిక సాయం నాలుగు విడతలలో అనగా బేస్‌మెంట్ స్థాయి, రూఫ్ లెవెల్ స్థాయి, స్లాబు స్థాయి, ఇల్లు పూర్తి దశలలో లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలకు నేరుగా ఆర్థిక సాయం జమ చేయటం జరుగుతుందని వివరించారు. ఈ సువర్ణ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకుని సత్వరమే ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు.

# పీ4తో బంగారు కుటుంబమే చంద్రబాబు లక్ష్యం

- పేదరికం లేని సమాజం నిర్మించేందుకు చర్యలు
- ఇబ్బందుల్లో ఉన్నా ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



కొండపి(చైతన్యరథం): పేదరికం లేని సమాజమే తమ ప్రభుత్వ లక్ష్యమని, పీ4..మార్గదర్శి, బంగారు కుటుంబం కాన్సెప్ట్‌తో రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేం దుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం పైడిపాడులో లబ్ధిదారులకు మంత్రి పెన్షన్లు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి నెలా 1వ తేదీనే పేదల తలుపు తట్టి పెన్షన్లు ఇస్తున్నాం..రూ.2,722 కోట్లు వెచ్చిస్తు న్నాం..రూ.1000 పెన్షన్ పెంచడానికి జగన్‌కి ఐదేళ్లు పట్టింది..ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తాము రూ.4 వేలకు పెంచామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి వెళ్లింది. చంద్రబాబు తన పాలనా దక్షతతో ఓ వైపు జగన్ చేసిన అప్పులు తీరుస్తూ మరో వైపు సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని వివరించారు. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు 20 శాతం ఉన్న పేదలను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెల సంస్కరణ వాదుల మాసం. అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, చంద్రబాబు వంటి సామాజికవేత్తలంతా ఈ నెలలోనే పుట్టారని పేర్కొన్నారు.

# వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలి

- రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్‌లో నిబంధనలు పాటించాలి
- సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యులకు అభినందనలు




విజయవాడ(చైతన్యరథం): వైద్యో నారాయణో హరి అన్న నానుడిని నిజం చేస్తూ వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యు ల ప్రమాణ స్వీకారం,పదవీ బాధ్యతల స్వీకరణ మంగళవారం జరిగింది.మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా జి.సుజాత, కె.వెంకట సుబ్బనాయుడు, డి.శ్రీహరి, స్వర్ణ గీత, ఎస్.కేశవరావుబాబు, సి.మల్లే శ్వరిలతో మంత్రి ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం ఏపీ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వైద్యులు తమ సర్టిఫికెట్లను ప్రతి ఐదే ళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించుకోవాలని, ఇది ఖచ్చితంగా అమ లు చేయాలని సూచించారు. దీంతో వైద్యుల పనితీరు పై పర్యవేక్షణ పెరుగుతుందని తెలిపారు. విదేశాల్లో ఉన్న వైద్యుల విషయంలో కొంత సమస్య ఉన్నప్పటి కీ వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించా లని సూచించారు. వైద్యులు నైతికవిలువలు పాటించా లని,అవసరం ఉన్నా లేకపోయినా యాంటిబయోటిక్స్ వాడించడం, వైద్యపరీక్షల పేరుతో రోగులు ఆర్థికంగా చితికిపోయేలా వ్యవహరించకూడదన్నారు. నేడు వైద్య వృత్తి వ్యాపారమైం దన్న విమర్శలకు చెక్ పెట్టాలని కోరారు. నేటి కాలంలో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగి పోయాయని, అందుబాటులోకి వస్తున్న కొత్త టెక్నాల జీని అందిపుచ్చుకుని సాధారణ డెలివరీలు జరిగేలా వైద్యం అందించాలని సూచించారు. ఏపీఎంసీలో మొత్తం 23మంది సభ్యులుఉంటారని, నలుగురు ఎక్స్ అఫిషియో మెంబర్లు, 13 ఎలక్టెడ్ మెంబర్లను ఎన్ను కోవాల్సి ఉందన్నారు.అలాగే మెడికల్ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక కూడా జరగాల్సి ఉందన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గోగినేని సుజాత, కాల్వకొల్లు వెంకట సుబ్బనాయుడు, దుగ్గ మాటి శ్రీహరిరావు, స్వర్ణ గీత, ఎస్.కేశవరావు బాబు, చుండూరి మల్లీశ్వరిలను మంత్రి ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం, ఏపీఎంసీ రిజిస్ట్రార్ రమేష్‌రెడ్డి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కోటి మందికి పైనే రెండో విడత సిలిండర్లు

- దీపం-2ను సద్వినియోగం చేసుకోవాలి
- మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ
- రబీలో 10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి(చైతన్యరథం): కోటి మంది లబ్ధిదారులు పైగా వినియోగించుకునేలా రెండో విడత దీపం-2 ఉచిత సిలిండర్ల పంపిణీని మంగళవారం నుంచి ప్రారంభించడం జరిగిందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయం నాల్గో బ్లాక్ ప్రచార విభాగంలో విలేకరులతో ఆయ న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నెరవేర్చిన మొదటి హామీ దీపం-2 అని, గత ఏడా ది అక్టోబరు 31న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్ఛాపురంలో ప్రారంభించడం జరిగింద న్నారు. ఈ పథకాన్ని పెద్దఎత్తున 99.03 లక్షల మంది సద్వినియోగం చేసుకోవడం జరి గిందని, దాదాపు రూ.760 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోని నేరుగా జమచేయడం జరిగిం దని తెలిపారు. రెండో విడత దీపం-2 పథకాన్ని మంగళవారం నుంచి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఈకేవైసీ నమోదు కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని, మొత్తం 4,24,59,028 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు 93 శాతం అంటే 3,85,74,194 మంది ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు మిగిలిన 3 శాతాన్ని కూడా ఈ నెల కల్లా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపా రు. ఈ ఏడాది జూన్ నుంచి 44,394 ప్రభుత్వ పాఠశాలలకు, 3,938 వసతి గృహాలకు నాణ్యమైన సన్నని బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో నెలనెలా కొరియర్ ద్వారా పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు ప్రత్యేకించి ఐదు గోదాములను కూడా ఏర్పాటు చేస్తు న్నట్లు చెప్పారు. రబీ సీజన్ ప్రారంభం నేపథ్యంలో దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగిందని చెప్పారు. కేం ద్రం అంచనాల మేరకు రాష్ట్రంలో ఈ రబీలో



దాదాపు 13.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్రంలో పండించడం జరుగుతుందని, అందులో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధం అవుతున్నామని వివరించారు. ఇందు కోసం 2,900 రైతు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా కేంద్రాల్లో దాదాపు 12 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఖరీఫ్‌లో 35,93,443 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.8,279 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. జీపీఎస్ విధానాన్ని తీసుకురావడం జరిగిం దని, గోతాలకు కూడా ఎటువంటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు. ఇదే ఖరీఫ్ సీజన్‌లో గత ప్రభుత్వ హయాంలో కేవలం 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి రూ.6,500 కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. మొత్తం మీద గతంతో పోల్చుకుంటే తమ ప్రభుత్వం 20 శాతం ఎక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 4.95 లక్షల మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే తమ ప్రభుత్వం నేటికీ 5.60 లక్షల రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కార్డులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రేషన్‌కార్డుల స్థానంలో రైస్ కార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తో త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడింగ్ కూడా ఈ రైస్ కార్డులకు ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగువతి నిబంధనలను సరళీకృతం చేయడం వల్ల తెలంగాణా ప్రభుత్వం కాకినాడ పోర్టు నుంచి దాదాపు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయడం జరుగుతుందని తెలిపారు.

# అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు!

పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటుచేసి, ఆయా స్టాల్స్‌లో అరకు కాఫీతోపాటు వివిధ అటవీ ఉత్పత్తులను ప్రదర్శించి అరకు కాఫీకి ఈ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయం. పార్లమెంట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషే కారణం. గిరిజనులు పండించే భౌగోళిక ప్రత్యేక గుర్తింపువున్న అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రోత్సహించడానికి ఏపీ ప్రభుత్వం తీసుకొన్న చొరవకు అన్ని వైపులనుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అరకు కాఫీని అత్యంత ప్రాధాన్య ఉత్పత్తిగా సీఎం చంద్రబాబు చేపట్టిన విస్తృత కార్యక్రమాలవల్ల ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. అంతర్జాతీయ వేదికలపై సీఎం చంద్రబాబు అరకు కాఫీ అద్భుత రుచిని గుర్తుచేస్తూ కాఫీ ప్రతిష్ఠను మరింత పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ కూడా మన్ కీ బాత్ కార్యక్రమంలో అరకు కాఫీ రుచిగురించి మాట్లాడటం విశేషం. విశాఖ మన్యంలో వందల ఎకరాల్లో మొదలైన కాఫీ సాగు నేడు లక్షల ఎకరాల్లో గిరిజనులు కాఫీ తోటలను సాగు చేస్తున్నారు. అటవీశాఖ పరిధిలో మరో పదివేల ఎకరాలకు పైగా పంటసాగు అవుతుంది. దీనిద్వారా ప్రతి ఏడాది 10,500 టన్నుల కాఫీ గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని గిరిజన సహకార సంస్థతోపాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మన్యంలో పండుతున్న అరకు కాఫీకి అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణం. ఆ మధ్య ఫ్రాన్సు రాజధాని పారిస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ప్రిక్స్ ఎపిక్యూర్ – 2018 బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది అరకు కాఫీ. మార్కెట్‌లో కాఫీ ప్రసిద్ధ బ్రాండ్లుగా పేరొందిన సుమత్రా, కొలంబో రకాలతో పోటీపడి బంగారు పతకం సాధించిన తొలి భారతీయ కాఫీ మిశ్రమంగా సత్తా చాటింది అరకు కాఫీ.

భారతదేశంలో కాఫీ పంట దిగుబడి అత్యధికంగా కర్ణాటక తరువాత తమిళనాడులో దిగుమతి అవుతుంది. అయితే ఆ రాష్ట్రాలను అధిగమించి దేశంలోనే రికార్డును సృష్టించాలని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. విశాఖలో నిర్వహించిన బ్రిక్స్ సదస్సు, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూవంటి ముఖ్య కార్యక్రమాల్లో సైతం దేశ, విదేశీయులు సైతం ఇక్కడి కాఫీ రుచి చూశారు. దీంతో ప్రపంచ దేశాల్లో విశాఖ కాఫీకి విశేష ఆదరణ పెరిగింది. ఈవిధంగా దేశంలో పలు రాష్ట్రాల్లో పెద్దపెద్ద మాల్స్, కార్పొరేట్ సంస్థల ద్వారాను కాఫీ గింజల అమ్మకాలు సాగించగలుగుతున్న జీసీసీ ఇకపై మరింతగా వ్యాపారాన్ని విస్తరించాలని నిర్ణయించింది. విశాఖ జిల్లాలోని చింతపల్లి, పాడేరు, అరకు ప్రాంతాల్లో కాఫీ పంటకు మంచి అనుకూల వాతావరణం వుంది. కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పోలిస్తే ఉత్పత్తి తక్కువే అయినా నాణ్యత ఎక్కువ ఉండటంతో మన్యం కాఫీకి డిమాండ్ వుంది.

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో పండించే కాఫీని అరకు కాఫీ అంటారు. ప్రస్తుతం మన్యంలో పార్చిమెంట్ అంబికా చెర్రీ, రోబస్టా రకాలు పండుతున్నాయి. అరబికా రకానికి ప్రపంచ మార్కెట్లో డిమాండ్ ఉంది. విదేశాల్లో గిరాకీవున్న సేంద్రీయ కాఫీ సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. జీసీసీ, ఐటీడీఏ, కాఫీబోర్డులు గిరిజనుల్లో చైతన్యం నింపి సేంద్రీయ పద్ధతులను ఆచరించేలా సహకరిస్తున్నాయి. విశాఖ మన్యం నాంది ఫౌండేషన్ మొదటిసారిగా సేంద్రియసాగును అమలులోకి తెచ్చి ఆ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడంలో చొరవ చూపింది. ఇలా పారిస్‌లోనూ అరకు కాఫీ షాపు ఏర్పాటైంది. విదేశాల్లో అరకు పేరుతో ప్రత్యేకంగా ఒక కాఫీ షాపు తెరిచారు. ప్రిక్స్ పెపిక్యూర్ పోటీల్లో బంగారు పతకం సాధించడం ద్వారా ఈ కాఫీ షాపు మరింత ప్రాచుర్యం పొందే అవకాశం ఏర్పడిందని చెప్పుకోవాలి. నాంది ఫౌండేషన్ సహకారంతో గిరిజన ఉత్పత్తి అయిన అరకు కాఫీ విస్తరిస్తున్న తీరు సంతోషాన్ని కలిగిస్తుందని పారిస్ కేఫ్‌ల్లోని ఎలక్ట్రానిక్ స్క్రీన్‌లపై అరకు గిరిజనుల జీవన శైలికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శిత మవుతున్నాయి. చంద్రబాబు ఆలోచనలు అద్భుతంగా వుంటాయని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర ప్రశంసించారు. పారిస్‌లో మా అరకు కాఫీ రెండో స్టాల్ ఇది అని రానున్న రోజుల్లో మరిన్ని రాబోతున్నాయని, ప్రపంచమంతా అరకు కాఫీతో మెల్కొంటుంది అని సీయం చంద్రబాబు స్పందించారు. అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపురావడం స్ఫూర్తిదాయకం అన్నారు చంద్రబాబు. గిరిజన అరకు కాఫీని దేశీయంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కృషి చేస్తున్నది. ఇప్పటికే విశాఖపట్నం విమానాశ్రయంలో కాఫీ షాపు ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసారు. రేణిగుంట, విజయవాడ, శంషాబాద్, చెన్నై విమానాశ్రయాల్లోనూ కాఫీ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. ఢిల్లీలో సుప్రీంకోర్టు ఆవరణలోను హైకోర్టు ఆవరణలోనూ జీసీసీ ఔట్‌లెట్ ఏర్పాటుకు సంబంధించి అధికారులతో సంప్రదింపులు జరపాలి. రైతుబజార్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, పర్యాటక ప్రాంతాల్లో జీసీసీ కాఫీషాపులు, ఔట్‌లెట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరగాలి.

రాష్ట్రంలో అధిక దిగుబడి వచ్చే అరకు, పాడేరు, చింతపల్లి, డుంబ్రిగుడ మండలాలకు సంబంధించి లక్షఎకరాల్లో కాఫీని రైతులతో పండించేందుకు 2018లో రెండువేల టన్నుల కాఫీ గింజల సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా 1400 టన్నులకు పైగా గింజలను సేకరించగలిగింది. దీనిద్వారా 12 కోట్ల రూపాయల మేర గిరిజన రైతులకు ప్రయోజనం కలిగింది. దీనివల్ల ఈ పంట ద్వారా లబ్ధి పొందుతూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్న దళారీ వ్యవస్థను నిర్మూలించినట్టు అయ్యింది. పదేళ్ల క్రితం సీఎం చంద్రబాబు రూ.500 కోట్లతో సమగ్ర కాఫీ తోటల అభివృద్ధి ప్రాజెక్టు మంజూరు చేసి ఐటిడీఏ, జీసీసీ విభాగాల ద్వారా తోడ్పాటు అందించారు.

2016లోనే అరకు కాఫీని ప్రాచుర్యంలోకి తెచ్చి కాఫీ రైతులను ప్రోత్సహించారు. సాగు విస్తీర్ణం పెంచారు. రైతులకు మంచి ధర దక్కేలా చేశారు. ఇప్పుడిక ఐటీడీఏ, జీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు వీలుగా కాఫీ పంట సాగు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాఫీ ప్రాజెక్టులో భాగంగా కాఫీ గింజలు సేకరణ ఏవిధంగా చేపట్టాలి? గిరిజన రైతులను ప్రోత్సహించడమెలా? ఇతర దేశాలకు ఏవిధంగా ఎగుమతి చేయాలి? జీఎస్టీతో ఎదురయ్యే సమస్యలేమిటి? కాఫీ పంట ఎగుమతిలో దళారులను నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన చర్యలేమిటి? కాఫీ గింజల సేకరణ కోసం సిబ్బందికి ఏవిధంగా శిక్షణ ఇవ్వాలి? అనే అంశాలపైనే జీసీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలి. కాఫీ పంట ద్వారా గిరిజన రైతులకు ప్రయోజనం కల్పించాలి.

ఇందుకోసం తొలుత దళారీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి. గిరిజన రైతులను ప్రోత్సహిస్తూనే దళారీ వ్యవస్థను నిర్మూలించి జీసీసీ సేకరించిన కాఫీ గింజలను దేశ, విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా ఏపీ కాఫీ ప్రతిష్ఠను మరింతగా పెంచాలి. కాఫీ గింజల సేకరణ కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. గిరిజన రైతులనుంచి నేరుగా కొనుగోలు చేయడం, వీరికి గిట్టుబాటు ధర కల్పించి ఆ మొత్తాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. ఏది ఏమైనా అరకు కాఫీ అంతర్జాతీయ ఖ్యాతి పొందడం, పార్లమెంట్ ప్రాంగణంలో స్టాళ్లను ఏర్పాటు చేసే ఘనతను సాధించడం, కాఫీ సాగు మన్యం గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడం గర్వకారణం.

- నీరుకొండ ప్రసాద్

# పింఛన్ల పంపిణీతో పేదల కళ్లలో ఆనందం : అచ్చెన్నాయుడు




● లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసిన మంత్రి

టెక్కలి (చైతన్యరథం): దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్క పింఛన్లకే ప్రతి నెలా 64 లక్షల మందికి ఏడాదికి రూ.33వేల కోట్లు కూటమి ప్రభుత్వం వెచ్చిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. గత ప్రభుత్వంలో విడత విడతలుగా రూ.2,250 మాత్రమే పింఛన్లు ఇచ్చారని, రూ.200 పింఛన్‌ను రూ.2వేలకు పెంచిన ఘనత టీడీపీ సొంతమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే... ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3,000 పింఛన్‌ను, రూ.4,000 వేలు పెంచడం జరిగిందన్నారు. దయాలసిస్ రోగులకు, తలసేమియా రోగులకు రూ.10 వేలు ఇస్తున్నామని, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నారని అన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని అప్పులు గత పాలకులు చేశారని, గత ఐదేళ్లలో పాలకులు రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసి ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉండే పరిస్థితి లేకుండా చేశారని తెలిపారు. 2019-24 మధ్యపాలించిన పాలకులు రాష్ట్రానికి తీవ్రమైన నష్టాన్ని చేశారని ఆరోపించారు. కేవలం బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి అనే మాట లేదని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అప్పులు గత ముఖ్యమంత్రి దేశ చరిత్రలో లేని విధంగా అప్పులు చేశారని ఆరోపించారు. ప్రజలను మోసగించే పాలన గత ఐదేళ్లలో జరిగిందన్నారు. గత పాలకులు అమ్మకు వందనం పథకం ఒక్కరికి మాత్రమే ఇచ్చారని విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు.

**పాఠశాలలు తెరిచిన వెంటనే తల్లికి వందనం పథకం అమలు**

జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభించిన వెంటనే తల్లికి వందనం పథకం అందజేయడం జరుగుతుందని, ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ వర్తిస్తుందని వెల్లడించారు. యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, షూ, కూడా విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా అని అందించడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలకు పక్కా గృహాలు... పేద ప్రజలకు పక్కా నివాసాలు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అదనపు ఆర్థిక సహాయం లబ్దిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. బీసీ, ఎస్సీల గృహ నిర్మాణానికి అదనంగా రూ.50వేలు, ఎస్టీల గృహనిర్మాణానికి రూ.75 వేలు ఆర్థిక సాయం చేయనుందని తెలిపారు. మొత్తంగా 3 లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

**గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పన నా బాధ్యత**

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంగా పెట్టుకున్నానని, రూ.460 కోట్ల అంచనాలయంతో కుళాయిలు వేస్తున్నామని వెల్లడించారు. రెవిన్యూ సమస్యలు పరిష్కరించండి అంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

# పెన్షన్ మొదలుపెట్టిందే ఎన్టీఆర్ : కిడారి శ్రావణ్ కుమార్



అరకు (చైతన్యరథం) : పెన్షన్ పథకం మొదలు పెట్టిందే ఎన్టీఆర్ అని, అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వ్యాఖ్యానించారు. మంగళవారం అనంతగిరి మండలం, భీంపోలు పంచాయతీలో కిడారి శ్రావణ్ కుమార్ పర్యటించి వృద్ధులు, వితంతులకు పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... నందమూరి తారక రామారావు వృద్ధుల వికలాంగుల అభ్యున్నతి కోసం నాడు పెన్షన్ల పంపిణీకి మొదటిసారిగా శ్రీకారం చుట్టారని, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రూ.200 నుంచి రూ.4వేలకు పెంచడం జరిగిందన్నారు. వికలాంగులకు రూ.6 వేలు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, కఠినమైన వ్యాధి అంటే పెరాల్సిస్ వ్యాధి వారికి రూ.15 వేలు అందిస్తు పెద్దఎత్తున సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం అవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేసి పరిపాలన చేశారని భవిష్యత్తులో ప్రతి కుటుంబం ఆర్థిక అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడతామని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అలాగే కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుతున్నానని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో కుమార్ సచివాలయ సిబ్బంది మండల అధ్యక్షుడు బుజ్జి బాబు ప్రధాన కార్యదర్శి ఆనందరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జోగులు నిర్మల యూనిట్, ఇన్‌ఛార్జులు లక్ష్మణరావు సుందరరావు, టీడీపీ నాయకులు సన్నీబాబు, అప్పలస్వామి, తిరుపతి, దేముడు, శ్యామ్, కో ఆప్షన్ సభ్యులు మదీనా, మాజీ ఎంపీటీసీ కొండమ్మ, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ అప్పారావు, మాజీ ఎంపీటీసీ సూకరాజు, ఎంపీడీఓ కుమార్, సమర్థి కొత్తూరు వైస్ ప్రెసిడెంట్ గాలి నర్సింహారావు, దోన్ను చిరంజీవి, జగన్, ఆనంద్ స్వామి, బిడ్డ మహేష్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల తాగునీటి తొట్టెలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): మండలం వెంకంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో పశువులకు నిర్మించ తలపెట్టిన తాగునీటి తొట్టెలకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం భూమి పూజ చేశారు. పశువులకు వేసవిలో నీటిఎద్దడి లేకుండా ఉండేందుకు వీటి నిర్మాణానికి ఎన్డీయే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వీటిని నియోజకవర్గం పరిధిలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశానికి గ్రామమే పట్టుకొమ్మలని, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పశువుల తాగునీటి తొట్టెలు, గోశాలలు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా వాటికి అవసరమైన తాగునీటి తొట్టెలను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గాజువాక చిన్న గంట్యాడలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరై పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రంలోనే ప్రప్రదంగా పెన్షన్లు అందజేసిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుదేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క పెన్షనర్లకి పెన్షన్లు అందజేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చ విజయకుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రసాదుల శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు అక్కిన లక్ష్మణరావు, అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు దిశగా అడుగులు : ఎమ్మెల్యే తోయక



కురుపాం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు దిశగా అడుగులు వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం మండలం ఆవిరి గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరం చేసిందన్నారు. రోడ్లు, ఇళ్ల నిర్మాణం, పెన్షన్ల పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కురుపాం మండల టీడీపీ కన్వీనర్ కొండయ్య, ఏఎంసీ చైర్మన్ కళావతి, గుమ్మలక్ష్మీపురం మండల టీడీపీ కన్వీనర్ సుదర్శనరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల నీటితొట్టెల పథకాన్ని ప్రారంభించిన గిడ్డి ఈశ్వరి



నియోజకవర్గం పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో మంగళవారం పంచ ప్రాధాన్యాలు కార్యక్రమంలో భాగంగా పశువులకు నీటితొట్టెలు పథకానికి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పశువుల నీటితొట్టెలను తవ్వారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్‌తో కలిసి భూమిపూజ కార్యక్రమంలో గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఈశ్వరరావు

ఎచ్చెర్ల (చైతన్యరథం): ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో 'మన ఊరుకి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని చాలా సమస్యలను ప్రస్తావించినట్టు చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి అడుకంటుపోయిందన్నారు. రూ.80 కోట్లతో నియోజకవర్గంలో పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని, మిగిలిన మూడు మండలాల్లో 80 శాతం పనులు జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ బెందు మల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు గాలి వెంకటరెడ్డి, వావిలపల్లి రామకృష్ణ, పైడి ముఖలింగం, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, నేతింటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అవసరాలకు అనుగుణంగానే చంద్రబాబు పాలన

**• లొల్ల గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు**



కొత్తపేట (చైతన్యరథం): వృద్ధులకు, వితంతువులకు ప్రతి నెలా ఒకటవ తేదీన ఆరంభించాలని వుండగా గత జగన్ ప్రభుత్వం సాకులతో వాయిదాలు వేసిన దాఖలాలు ఉన్నాయని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాకులు కాకుండా ఠంచనుగా పెన్షన్లు ఇస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం లొల్ల గ్రామంలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వంలా సాకులు చెప్పడం లేదని ఒకటవ తేదీన సెలవు రోజు వస్తే ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఈ నెలకు బ్యాంకులకు వరుసగా సెలవులు రావడంతో ఒకటవ తేదీన పెన్షన్ల పంపిణీకి అడ్డు లేకుండా 29వ తేదీనే పెన్షన్ల సొమ్మును ఆయా అధికారులకు అందించారని గుర్తుచేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని చెప్పారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తోందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాయల జగన్నాధం, లొల్ల రామం, కల్లూరి పుత్ర సాయిరాం, మెడిద సత్తిపండు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు మంచి గుర్తింపు గౌరవం ఇచ్చే విధంగా సభ్యత్వ కార్డును రూపొందించారు

**●త్వరితగతిన కుటుంబ సాధికార సారధులను నియమించాలన్న ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): కార్యకర్తలకు మంచి గుర్తింపు గౌరవం ఇచ్చే విధంగా సభ్యత్వ కార్డును రూపొందించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. మంగళవారం గోరంట్ల వారి కార్యాలయం నందు రూరల్ నియోజకవర్గం నందు వార్డులు మరియు కడియం మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... కోటి మంది సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందించే విధంగా క్లస్టర్ ఇన్‌ఛార్జ్, యూనిట్ ఇన్‌ఛార్జ్, బూత్ ఇన్‌ఛార్జ్ సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరికి కార్డు అందే విధంగా బాధ్యత తీసుకోవాలని, రూరల్ నియోజకవర్గంలోని 264 బూత్‌లకు బూత్ వారీగా బాక్స్ అందిస్తున్నామని, దానిలో సభ్యత్వ నమోదు చేసుకున్న వారి వివరాలు మరియు సభ్యత్వ కార్డులు మెడలో వేసుకునే ట్యాగ్ ఉంటాయని తెలిపారు. అలాగే ప్రతి 60 మంది ఓటర్లకు ఒక పురుషుడు, ఒక స్త్రీ ఉండే విధంగా కుటుంబ సాధికార సారధులను నియమించాలని రాష్ట్రస్థాయి పదవి నుండి గ్రామస్థాయి పదవి వరకు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కుటుంబ సాధికార సభ్యులలో ఉండాలని త్వరితగతిన కుటుంబ సాధికార సారధులను నియమించాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, టెలిగ్రామ్ బాట్‌లో ప్రతి ఒక్కరికి కార్డు అందించే విధంగా ఒక ప్రణాళిక రూపొందించారని, ఆ యాప్‌లో ప్రతి ఒక్కరికి కార్డు అందించే సమయంలో ఆ యాప్ నందు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియం మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల సత్యనారాయణ (చంటి), చెల్లుబోయిన శ్రీనివాస్, బోడపాటి గోపి, పితాని శివ రామకృష్ణ, గుత్తుల కృష్ణ, ముమ్మిడి దేవి నాగేశ్వరావు, దేవళ్ళ రాంబాబు, గుర్రపు సత్యనారాయణ, వట్టికూటి దత్తుడు, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, వరగోగుల వెంకటేశ్వరరావు,వాసంశెట్టి నాగబాబు, అన్నందేవుల కోదండ రాముడు, నెలపూడి కింగ్, బొరుసు వెంకటేశ్వరరావు, నిమ్మలపూడి గోవింద్, శీలం గోవింద్, రొంపిచర్ల ఆంటోనీ, యార్లగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భద్రతా పింఛన్లు ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమే



అమరావతి (చైతన్యరథం): సామాజిక భద్రతా పింఛన్లు ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమేనని, ఎన్టీఆర్ హయాంలో నెలకు రూ.35తో ప్రారంభమైన పింఛన్ల పంపిణీ నేడు చంద్రబాబునాయుడు చలువతో రూ.4000కు చేరిందని మాజీమంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు మొదటిసారి సీఎం కాగానే రూ.35గా ఉన్న పింఛన్‌ను రూ.75కి పెంచడం జరిగిందన్నారు. 2004 ఎన్నికల ప్రచారంలో పెన్షన్లను రూ.200 చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ఆర్ అధికారంలోకి రాగానే.. రూ.25మాత్రమే పెంచారని, ఒకేదఫా చేస్తామని చెప్పలేదని దబాయిస్తూ.. ఏడాదికి రూ.25చొప్పున పెంచుతామని అప్పటి ఆర్థిక మంత్రి రోశయ్య ప్రకటించడం జరిగిందన్నారు. 2014 జూన్ 8న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే పెన్షన్లను రూ.200 నుంచి రూ.1,000కి పెంచారని, అనంతరం వాటిని రూ.2 వేలుకు పెంచారని అన్నారు. ఐదేళ్లలో 10రెట్లు పెంచిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పెన్షన్లు పెంచుతామని జగన్ రెడ్డి మోసం చేవారని మండిపడ్డారు. రూ.3000లకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్... ఏడాదికి రూ.250 మాత్రమే పెంచి పెన్షన్‌దారులను ముంచేశారని అన్నారు. పెన్షన్ పేరుతో వృద్ధులను జగన్ రెడ్డి వంచిస్తే సీఎం చంద్రబాబు మాత్రం పేదలను అక్కున చేర్చుకున్నారని పీతల సుజాతా కొనియాడారు.

# కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది : గౌతు శిరీష

పలాస (చైతన్యరథం): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మండలంలోని కొత్తపేటలో జరిగిన టీడీపీ ఆవిర్భావవేడుకల్లో జెండా కడుతూ విద్యుదాఘాతానికి గురైె కార్యకర్త గుంటు జానకిరావు గాయపడిన విషయం విదితమే. దీంతో గత సోమవారం కొత్తపేటలో జానకిరావును శిరీష పరామర్శించారు. ఆమెవెంట టీడీపీ నాయకులు మల్లా సూర్యం, పుచ్చ ఈశ్వరరావు, గోవిందపాపారావు, బైపల్లి నారా యణ, కంబాల రాంబాబు, చింత నారాయణ, నారాయణస్వామి ఉన్నారు.



# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**●టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. ప్రతినెలా 1వ తేదీన లబ్దిదారుల ఇళ్లకే నేరుగా వెళ్లి పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో సచివాలయం సిబ్బంది మరియు స్థానిక టీడీపీ నేతలతో కలిసి పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా 1వ తేదీన ఒకేసారి 4వేల రూపాయలు పెన్షన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం టీడీపీ కూటమి ప్రభుత్వం అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ఆయనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇస్తున్నారని ఇది ప్రజా ప్రభుత్వం అని, పేదరికం నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పి4 కార్యక్రమం ఉగాది సందర్భంగా ప్రారంభించారని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఏపీని ఉంచాలి, పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని నిలపాలని కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది అని శేషు తెలిపారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీనివాసపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ, రాగాని శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పొల్నాటి చినబాబు, ఎలికే ప్రసాద్, బండారు వెంకట్రావు, రాగాని రామకృష్ణ, చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేసిన మద్దిపాటి



గోపాలపురం (చైతన్యరథం): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛన్ల పండుగను ప్రారంభించిందని, రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి నెలలో మొదటి రోజు నుంచే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వ్యాఖ్యానించారు. మంగళవారం ద్వారకా తిరుమల మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.4 వేలు పెన్షన్లు అందించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో సచివాలయ ఉద్యోగులకు పెన్షన్ల పంపిణీ బాధ్యత అప్పగించకుండా అకౌంట్లలో జమచేసి పెన్షన్‌దారులను ఇబ్బందులు పెట్టారు. 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నప్పటికీ అప్పట్లో అధికారులు అంగీకరించలేదు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పకడ్బందీగా పెన్షన్ల పంపిణీ చేపట్టవచ్చని నిరూపించేందుకు కూటమి సర్కార్ చర్యలు ప్రారంభించిందన్నారు.

# ఫింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



మండపేట (చైతన్యరథం): పట్టణంలోని సంఘం కాలనీ–2లో మంగళవారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఫింఛన్లు పంపిణీ కార్యాక్రమంలో పాల్గొని అర్హులైన వారికి ఫింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఈ సంధర్బంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు తమకు సక్రమంగానే అందుతున్నాయని పింఛన్ పెంచడం వల్ల తమకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే అత్యధికంగా పెన్షన్ పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏదైనా ఉంది అంటే అది ఒక ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ లబ్దిదారులకు ఒకటో తేదీన వారి ఇళ్ళకు వెళ్లి ఫించను ఇవ్వటం జరుగుతోందన్నారు. అదేవిధంగా వితంతువులైన మహిళలకు సకాలంలో పింఛన్లను అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, గుత్తుల సత్తిబాబు, వేమగిరి మోసె, కోనె రమేష్, తదితరులు ఉన్నారు.

## ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్ టన్నెల్‌ను విస్తరించాలి : ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు



విజయవాడ (చైతన్యరథం): కృష్ణా తూర్పు డెల్టా పరిధిలోని ఏలూరు కాలువ ఆయకట్టు బుడమేరు ప్రధాన డ్రెయిన్ వల్ల వరదలతో మునిగిపోకుండా కాపాడటానికి ఎనికేపాడు అండర్ టన్నెల్‌ను విస్తరించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత సెప్టెంబర్‌లో కురిసిన భారీ వరదలకు బుడమేరు ప్రధాన డ్రెయిన్ ఉప్పొంగి విజయవాడ పట్టణంతో పాటు ఎనికేపాడు అండర్ టన్నెల్ దగ్గర నీరు కిందకు వెళ్లక ఏలూరు కాలువకు గండ్లుపడి ఎనికేపాడు ఆయకట్టులో 500 ఎకరాలు మొదటి పంట పూర్తిగా మునిగిపోయిందన్నారు. బుడమేరు వరదలవల్ల ఏలూరు కాలువకు జరిగిన నష్టాన్ని అసెంబ్లీ వేదికగా గన్నవరం శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారని, ఎనికేపాడు దగ్గర వున్న అండర్ టన్నెల్ బ్రిటీష్ కాలంలో 11 ఖానాలతో 4300 క్యూసెక్కులు వరదనీరు వెళ్ళటానికి నిర్మించారని అన్నారు. దీనిని 22 ఖానాలు విస్తరించి 15,000 క్యూసెక్కులు దిగువకు వరద నీరు వెళ్ళేలాగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014-19లో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బుడమేరు డ్రైన్‌ను వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు వరకు అభివృద్ధి చేయటానికి రూ.506 కోట్లతో అంచనాలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. బుడమేరు ప్రధాన డ్రెయిన్ పూడిక తీయటం, కట్టలు బలపరచటం, ముస్తాబాద్ వద్ద వున్న రైల్వే లైన్ దగ్గర పాత కల్వర్టుల స్థానంలో కొత్త బ్రిడ్జిలు ఎనికేపాడు అండర్ టన్నెల్ విస్తరణ చేపట్టాలని, కానీ వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పక్కన పెట్టిందన్నారు. వైసీపీ హయాంలో బుడమేరు కట్టలను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారని, దీని వలన ఇటీవల వచ్చిన వరదలకు విజయవాడ పట్టణం అతలాకుతలం కావడమే కాకుండా కృష్ణా తూర్పు డెల్టాలో ఏలూరు కాలువ కూడా విధ్వంసానికి గురైనదన్నారు. నాటి వైసీపీ పాపాలే నేటికి వేంటాడుతున్నాయని, వర్షాకాలం వచ్చేలోపు ఏలూరు కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టి రైతులను ప్రజలను ఆదుకోవాలని ఆళ్ళ గోపాలకృష్ణారావు కోరారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని 28వ వార్డు ఓబయ్య కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర నిరుపేదవర్గాల వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతో ఆసరాగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఎమ్.ఐ.డి.హెచ్. లక్ష్యం

ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): "కేంద్ర ప్రభుత్వం 2014-15 నుండి మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ అనే పథకాన్ని అమలు చేస్తోంది. దేశ వ్యాప్తంగా హార్టికల్చర్ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ పథకం అమలు అవుతోంది. ఈ పథకంతో పాటు హార్టికల్చర్ రైతులకు మద్దతుగా వుండేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్, ధర తేడా భర్తీ చెల్లింపు వంటి పథకాలు ప్రోత్సహాలు అమలు చేస్తోంది." అని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖను హార్టికల్చర్ రైతులకు కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా అందిస్తున్న మద్దతు తెలియపర్చాలంటూ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ పథకాన్ని సమీక్షించడానికి నీతి ఆయోగ్ సహా అనేక స్వతంత్ర సంస్థల ద్వారా అధ్యయనాలు నిర్వహించబడ్డాయి. ఇందువల్ల హార్టికల్చర్ రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర, నిల్వ సౌకర్యాల లోపం, మార్కెటింగ్ సవాళ్లు, నీటి సరఫరా సమస్యలు ప్రధానంగా గుర్తించటం జరిగిందని కేశినేని శివనాథ్ తెలిపారు.

## విద్యా వ్యవస్థలో విలువలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

- గత ఐదేళ్లు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు
- ఎయిడెడ్ స్కూళ్లను నాశనం చేసి, ఆస్తుల కబ్జాకు ప్రయత్నించారు
- త్వరలోనే మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరత నిర్మూలిస్తాం
- 47వ డివిజన్లో మున్సిపల్ స్కూల్ పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని 47వ డివిజన్లో ఉన్న మున్సిపల్ స్కూల్‌ని ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. స్కూల్లో ఉన్న సదుపాయాలు, మిడ్ డే మీల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా సమయం గడిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నో బ్యాగ్ డే ప్రకటించి ప్రతి శనివారం కూడా మోరల్ ఎడ్యుకేషన్, క్రాఫ్ట్ ఎడ్యుకేషన్ లాంటి వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టాం. గత ఐదు సంవత్సరాల పాటు రాష్ట్ర విద్యా వ్యవస్థను అస్తవ్యస్థం చేశారు. ఎయిడెడ్ స్కూళ్ల ఆస్తుల్ని లాక్కునేందుకు కుట్రలు చేశారు. జీవో నెం.117తో విద్యా వ్యవస్థను నాశనం చేశారు. దీనిపై ఈ మధ్యనే ఎమ్మెల్యేలందరి అభిప్రాయాలు సేకరించి పరిస్థితుల్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలనే లక్ష్యంతో 16800 ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. వచ్చే విద్యా సంవత్సరంలోనే ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేస్తాం. అదే సమయంలో తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సాయం అందించే చర్యలకు శ్రీకారం చుట్టాం. విద్యా రంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రజలు ముందుకు రావాలి. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తయారు చేసుకుందాం. విద్యార్థుల శక్తి సామర్థ్యాలతో పాటు, ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని కూడా పర్యవేక్షించుకోవాల్సిన అవసరం వచ్చింది. విద్యా రంగంలో మచిలీపట్నానికి ఉన్న గుర్తింపును పునరుద్దరిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

**మామయ్య ఆశయాలకు అనుగుణంగా నడచుకుంటా**

నడకుదిటి నరసింహారావు అనే బ్రాండ్ ఇమేజ్‌ను ఎన్ని తరాలైనా మచిలీపట్నం ప్రజలు మరచిపోలేరని, వారి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు నాలుగో వర్థంతి సందర్భంగా మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావుగారితో కలిసి నరసింహారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. వారితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

## ఉపాధి హామీ పనులతో గ్రామాల్లో ప్రగతి : ఎమ్మెల్యే యార్లగడ్డ



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): గ్రామాల్లో కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాల్లోని చిన్నపాటి సమస్యలు పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దోహద పడుతోందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం దంటగుంట్ల గ్రామంలో మంగళవారం ఉదయం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి పింఛన్లు పంపిణీ చేసిన ఆయన అనంతరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన లింకు రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన యార్లగడ్డపై పూల వర్షం కురిపిస్తూ ప్రజల ఘన స్వాగతం పలికారు. యార్లగడ్డ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ గ్రామంలో ప్రతి ఇంటికి పాదయాత్రగా నడిచి వెళ్లారు. తదనంతరం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. దినసరి వేతనం ఎంత వస్తుంది పెంచిన వేతనం సక్రమంగా అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని తాగనుంటి చెరువు పూడిక తీసి మంచినీటితో నింపాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామంలో అంతర్గత రహదారుల సమస్య గురించి కొందరు ప్రస్తావించారు. త్వరలోనే అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలను తీర్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ అభివృద్ధి చేయడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడ వరకు రహదారి ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. మండల కేంద్రమైన బాపులపాడులోను ప్రధాన రహదారిపై మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ఇప్పటికి అధికారులకు సూచనలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. కుల మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని చెప్పారు.

## పెరిగిన పెన్షన్లతో పేదల జీవితాల్లో వెలుగులు : నక్కా ఆనందబాబు

వేమూరు (చైతన్యరథం): రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం చంద్రబాబునాయుడు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాల్లో వెలుగులు నింపారని మాజీమంత్రి నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. మంగళవారం సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలోని లబ్ధిదారులకు నేరు పెన్షన్ అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేలతో పాటు మూడు మాసాలకు మరో రూ.3 వేలు అదనంగా ఇవ్వడం టీడీపీకే సాధ్యమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా.. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు పెన్షన్ అందిస్తున్నామని అన్నారు. ఇక దివ్యాంగుల పెన్షన్ డబుల్ చేస్తూ 6 వేలకు పెంచడం జరిగిందని, పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైనవారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడినవారికి, వీల్‌ఛైర్‌లో ఉన్నవారికి అందే రూ.5 వేల పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్తుల పెన్షన్‌ను రూ.5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచి ఇస్తున్నామని అన్నారు. పెరిగిన పెన్షన్లతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, వాలంటీర్లు అవసరం లేకుండానే నెలలో మొదటి రోజునే లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం










# అందరికీ సంక్షేమ పథకాలే కూటమి లక్ష్యం

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
## వాడవాడలా పండుగలా పెన్షన్ల పంపిణీ

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ, (చైతన్యరథం): పట్టణంలోని 28వ వార్డు ఓబయ్య కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఇతర నిరుపేద వర్గాల వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతో ఆసరాగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు.లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు గారు జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ గారు మున్సిపల్ చైర్మన్ గారు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

### వలేటిపాలెంలో..

*కందుకూరు:* వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం పంచాయతీలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే అంకభూపాలపురం గ్రామంలో గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్ర దేవ్, ఎమ్మార్వో హమీద్ మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు ప్రగడ శ్రీనివాసులు, చుంచు శ్రీనివాసులు, బక్కమంతల మాల్యాద్రి, ప్రగడ మోహన్, శిగిరి కొండారెడ్డి, అధికారులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

### నాగులుప్పలపాడులో....

**నాగులుప్పలపాడు:** మండలం చేకూరపాడు గ్రామంలో సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు విజయ్ కుమార్ ఎన్టీఆర్ భరోసా సామజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్ని ఇంటి ఇంటికీ వెళ్లి పెన్షన్‌దారులకి 4000 వేల రూపాయలు అందచేసి అనంతరం గ్రామంలో సీసీ రోడ్డులను తారు రోడ్డును సైడ్ డ్రైన్స్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జి గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మి వరప్రసాద్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కరణం మోహన్ రావు గారు,యూనిట్ ఇంచార్జి నెప్పలి శివకృష్ణ, భాస్కర్,శివ శంకరావు, త్రిమూర్తి, పైనం సురేష్, పైనం జార్జి ,రాజు మెట్టు సుబ్బయ్య నాయుడు, స్వర్ణ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

### దర్శిలో...

**దర్శి:** న్టీఆర్ పెన్షన్ల పంపిణీలో భాగంగా మంగళవారం ఉదయం దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చేతుల మీదుగా క్రమం తప్పకుండా ఈ ఒకటవ తేదీనే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

### యర్రగొండపాలెంలో...

**యర్రగొండపాలెం:** పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని చైతన్య నగర్ లో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు స్వయంగా పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణి చేశారు. కూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయకత్వంలో పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉదయం 7 గంటల నుండే పంపిణీ చేశామన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్ దారులకు ?4వేలు, వికలాంగులకు ?6వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చీరాలలో

**చీరాల :** నియోజకవర్గంలోని గవినివారిపాలెం గ్రామం, వేటపాలెం మసీ సెంటర్ నందు, చీరాల పట్టణం 18,19 వార్డ్ నందు, చీరాల మండలం రామకృష్ణాపురం నందు, వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో శివాలయం దగ్గర "ఎన్టీఆర్ భరోసా పథకం" కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారికి పెన్షన్లను పంపిణీ చేసిన చీరాల శాసనసభ్యులు శ్రీ మద్దులూరి మాలకొండయ్య గారు, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత గారు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### నెల్లూరులో...

**నెల్లూరు:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు సిటీ , 47 డివిజన్ లో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు.

### మార్కాపురంలో

మార్కాపురం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల తో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిపిలుపు మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున్ పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలేపాటి వెంకట్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి తార్లపల్లి సత్యనారాయణ గారు సీనియర్ నాయకులు కనిగిరి బాల వెంకటరమణ మాజీ కౌన్సిలర్ కొప్పుల శ్రీను గారు రాష్ట్ర మైనార్టీ నాయకులు ఇబ్రహీం నాయకులు బంతల పుల్లారావు ఎం ఎం శర్మ బిజెపి నాయకులు పివి కృష్ణారావు శేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున గారు మాట్లాడుతూ సంక్షేమానికి సామాజిక భద్రతకు భరోసాని కల్పిస్తూ ఎన్టీఆర్ పెన్షన్ కార్యక్రమం నాలుగువేల రూపాయలను అందజేయడం ఎంతో ఆనందదాయకమని ఆయన తెలిపారు.... గత ప్రభుత్వం అరకొరగా అందిస్తున్న పెన్షన్ ని ఏకంగా 4000 రూపాయలకు చేసి ఒకటవ తారీఖునే లబ్ధిదారులకు అందజేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు.








బయోప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తదితరులు



ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం చిన్న గంజాం మండలంలోని కొత్త గొల్లపల్లి గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం కోసం విచ్చేసిన గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారిని హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

## హామీలన్నీ అమలు చేద్దాం: ముఖ్యమంత్రి చంద్రబాబు

### మంత్రి గొట్టిపాటితోపాటు కలిసిన గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): బాపట్ల జిల్లా, చినగంజాం మండలం, గొల్లపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విధ్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌తోపాటు దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దర్శి నియోజకవర్గ సమస్యలపై ప్రియతమ ముఖ్యమంత్రికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమల్లో భాగంగా అన్న కాంటీన్ ఏర్పాటు, రోడ్లు విస్తరణ పనులు, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్ళడం తదితర పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా దొనకొండలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయడం పట్ల లక్ష్మీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ తెలిపారు.



# ఎక్కడ దాక్కున్నా బయటకు రప్పిస్తాం

## వైసీపీ అక్రమార్కులకు మంత్రి సవిత హెచ్చరిక, వారు దోచుకున్న ప్రతి రూపాయినీ ప్రజలకిస్తాం, తప్పు చేసినవారే బాత్ రూముల్లో జారిపడుతున్నారు జగనో టూరిస్ట్



పెనుకొండ, (చైతన్యరథం): అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు ఎక్కడ దాకున్నా బయటకు తీసుకొస్తామని, వారు దోచుకున్న ప్రతి రూపాయిని స్వాధీనం చేసుకుని, ప్రజలకిస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. తప్పు చేయనప్పుడు భయమెందుకని, తమ ప్రభుత్వం ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోదని తెలిపారు. జగనో టూరిస్ట్ అని, అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చి వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. పెనుకొండ పట్టణంలోని గడంగ్ వీధి, కుమ్మరిదొడ్డి కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను స్వయంగా మంత్రి సవిత పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడారు. మొన్న ఉగాది, నిన్న రంజాన్, ఈరోజు పెన్షన్ల పండగను రాష్ట్రంలో జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షలకు పైగా లబ్ధిదారులకు రూ. 2,717 కోట్లు అందజేస్తున్నామన్నారు. సత్యసాయి జిల్లాలో 2.61 లక్షల మందికి రూ.117 కోట్లు, పెనుకొండ నియోజక వర్గంలో 41 వేల మందికి రూ.17 కోట్లు అందజేస్తున్నామన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా వితంతవులు, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల మేర పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతి, పోలవరం, విశాఖ రైల్వే జోన్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

త్వరలో టీచర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

### పశువుల సంరక్షణకు పెద్దపీట

ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకుని పశువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. ఇప్పటికే నియోజక వర్గ వ్యాప్తం గోకులం షెడ్లు నిర్మాణాలు ప్రారంభించామన్నారు. దీంతో పాటు పశువులకు నీటి ఎద్దడి రాకుండా ఉండడానికి తాగునీటి తొట్టెలు కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. స్వచ్ఛాంధ్రలో పెనుకొండ పట్టణాన్ని ప్రథమ స్థానంలో నిలుపుదామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు.

### ఎక్కడ దాక్కున్నా బయటకు రప్పిస్తాం

జగన్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులను ఎక్కడ దాక్కున్నా బయటకు రప్పిస్తామని, వారు దోచుకున్న ప్రతి రూపాయిని కూడా స్వాధీనం చేసుకుని ప్రజలకిస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. గడిచిన అయిదేళ్లు దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా జగన్ పాలన సాగిందన్నారు. తప్పు చేయకుంటే ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని, రెడ్ బుక్ అంటే భయమెందుకని మంత్రి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటోందని స్పష్టంచేశారు.

### జగనో టూరిస్ట్...

జగనో టూరిస్ట్ అని, అప్పుడప్పుడూ రాష్ట్రానికి వచ్చి బెంగుళూరుకు వెళ్లిపోతుంటారని మంత్రి సవిత ఎద్దేశా చేశారు. ఆయన అయిదేళ్ల పాటు కళ్లు మూసుకుని కూర్చోవడం వల్లే ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ లో చేరడానికి జగన్ చూస్తున్నారన్నారు. ఆ పార్టీ పిలుపుకోసం ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. 2014-19 మధ్య అధికారంలో తమ పార్టీ ఉందని, తరవాత 2019-24 మధ్య ప్రతిపక్షంగా ప్రజల తరఫున పోరాటం చేశామన్నారు. ఈరోజు వైసీపీ వారు అసెంబ్లీకి కూడా రావడానికి భయపడుతున్నారని, దొంగల్లా వచ్చి వెళుతున్నారని అన్నారు.

### పెనుకొండ రూపు రేఖలు మారుస్తున్నాం...

అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే పెనుకొండ పట్టణం రూపు రేఖలు మార్చినట్లు మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుతం పెనుకొండ పట్టణంలోనే రూ.5 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తి చేశామని, త్వరలో కోనాపురం, ఇస్లాంపురం రోడ్లను కూడా నిర్మిస్తున్నామన్నారు. ఇటీవలే పెనుకొండ ఆర్చిని అభివృద్ధి చేశామని, త్వరలో పట్టణంలో సెంట్రల్ లైటింగ్, పట్టణంలో తాగునీటి కల్పనకు ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకున్నామని మంత్రి సవిత తెలిపారు.




## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

### బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపు

పెనుకొండ, (చైతన్యరథం): బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టా త్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పెనుకొండ పట్టణంలో బీసీ మహిళలకు ఉచితంగా శిక్షణ కుట్టు మిషన్ ఇచ్చే కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని ఈ అవకాశాన్ని ఆన్ లైన్ లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌలి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

### పాల్గొన్న ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు కాలువ, అమిలినేని

కళ్యాణదుర్గం, (చైతన్యరథం): నియోజకవర్గం కళ్యాణదుర్గం రూరల్ మండలం మోరేపల్లి గ్రామంలో, ఎస్సార్సీ కన్స్ట్రక్షన్స్, కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధి, రాయదుర్గం నియోజకవర్గం శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉగాది, రంజాన్ పండగలా పెన్షన్ల పంపిణీ



పుట్టపర్తి, (చైతన్యరథం): నియోజకవర్గం నియోజకవర్గం, నల్లమాడ మండలం, యర్రవంక పల్లి, నల్లసింగయ్య గారి పల్లి, ఎద్దుల వారి పల్లి తండాలతో పాటు పలు గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు, నాయకులతో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలిసి పాల్గొన్నారు.



### డోన్‌లో...

డోన్ మండలం, ఉడుములపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసి, ప్రజలతో మమేకమయ్యారు.

### నందికొట్కూరులో..

నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామంలో పింఛన్ పంపిణి కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఆయన వెంట మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి, సత్యంరెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, నాగేశ్వరావు రెడ్డి, రాఘవరెడ్డి, విజేయుడు, వెంకటరాముడు,సున్నంపల్లి శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, సురేంద్ర, జయపాల్, నాగేశ్వర్ రెడ్డి అధికారులు ,టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

### ఎమ్మిగనూరులో...

ఎమ్మిగనూరు, (చైతన్యరథం): పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలోని 32వ వార్డులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పింఛన్లు అందజేశారు.





## రేషన్ సమస్యలు పరిష్కరించుకుందాం

### డీఎస్‌వో, డీలర్లతో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్సార్ సమావేశం

మడకశిర, (చైతన్యరథ,): స్టోర్ డీలర్ల సమస్య గురించి డీఎస్‌వో వంశీకృష్ణతో మడకశిర శాసనసభ్యులు టీటీడీ పాలక మండలి సభ్యులు ఎం.ఎస్ రాజు సమావేశం నిర్వహించారు. మడకశిర పట్టణం ఆర్అండ్ బి విశ్రాంతి భవనంలో శ్రీ సత్య సాయి జిల్లా వంశీకృష్ణతో ఎమ్మెల్యే సమావేశమై స్టోర్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా గత ఆగస్టు నెల నుంచి కీ రిజిస్టర్ ప్రకారం రేషన్ పంపిణీ చేయడం జరుగుతూ ఉండేది, కానీ ఏప్రిల్ నెలకి సంబంధించి జనవరి ఫిబ్రవరి మార్చి మూడు నెలలు వేసిన బియ్యాన్ని యావరేజ్ చేసి ఆర్వో రైస్ చేయడం జరిగింది, అందుకుగాను ప్రతి డీలర్‌కు చాలా తక్కువ బియ్యం వచ్చాయి. దానివల్ల లబ్ధిదారులకు డీలర్లు బియ్యం పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోతున్నారు. ఈ విషయంపై స్పందించిన డీఎస్వో వెంటనే చర్యలు తీసుకుంటామని సమస్య పునరావృతం కాకుండా చూస్తామని వివరణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, అన్ని మండల తాసిల్దార్ లు, మండల కన్వీనర్లు, జడ్పిటిసి సభ్యులు, మండల కన్వీనర్లు స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.



# లాటిన్ అమెరికాలో భారత్‌కు చిలీ ప్రధాన భాగస్వామి



- ఆ దేశ అధ్యక్షుడు గాబ్రియేల్‌తో భేటీలో ప్రధాని మోదీ
- ఐదు రోజుల పర్యటనకు వచ్చిన చిలీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: లాటిన్ అమెరికాలో చిలీ దేశం భారత్‌కు అత్యంత ప్రధానమైన దేశమైన ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత పర్యటనకు విచ్చేసిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్‌తో ప్రధాని భేటీ అయ్యారు. ఆర్థిక, వాణిజ్య, సామాజిక రంగాలతో సహా వివిధ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. లాటిన్ అమెరికాలో భారత్‌కు చిలీ ఓ ముఖ్యమైన భాగస్వామి అని పేర్కొన్నారు. చిలీని అంటార్కిటికాకు గేట్‌వేగా చూస్తున్నామన్నారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించామని.. వాటిని కొనసాగించాలన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ మెడిసిన్, వ్యవసాయ ఉత్పత్తుల సహకారంపై ఒప్పందాలు ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

భారత్, చిలీల మధ్య ఎన్నో సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. సమకాలీన సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఇతర ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు అవసరమని భావిస్తున్నామని.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి పిలుపునిచ్చామని తెలిపారు.

గాబ్రియేల్ మాట్లాడుతూ తన భారత్ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. పరస్పరం సాంస్కృతిక సహకారం అందించుకుంటామని అన్నారు. 'షూట్ ఇన్ చిలీ' ప్రోగ్రాం ద్వారా భారత చిత్రపరిశ్రమతో కలిసి పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం ఢిల్లీకి వచ్చిన చిలీ అధ్యక్షుడు రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో చర్చల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ఆయన ఆగ్రా, ముంబయి, బెంగళూరుకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేయనున్న విందులో చిలీ అధ్యక్షుడు పాల్గొననున్నట్లు సమాచారం.

# ఇళ్ల కూల్చివేత అమానవీయం



- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశం


న్యూఢిల్లీ: ఇళ్ల కూల్చివేతలపై ఉత్తప్రదేశ్ ప్రభుత్వం, ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థపై సుప్రీంకోర్టు మంగళవారంనాడు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇళ్ల కూల్చివేత అమానవీయం అని, దేశంలో 'రూల్ ఆఫ్ లా' అనేది ఒకటి ఉందని గుర్తుపెట్టుకోవాలని మందలించింది. అధికారుల తీరు దిగ్భ్రాంతికరమని వ్యాఖ్యానించింది. బాధితులకు ఆశ్రయం పొందే హక్కు కూడా లేదా..అని ప్రశ్నించింది. అధికారులు కూల్చేసిన వేసిన ఇంటి బయట ఒక చిన్నారి ఏడుస్తూ ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడం గురించి న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఇటువంటి దృశ్యాలు చూసి ప్రజల హృదయాలు కలత చెందుతున్నాయన్నారు.

ప్రయాగ్‌రాజ్‌లో ఇళ్ల కూల్చివేతలు దిగ్భ్రాంతికరం. బాధితులకు ఆశ్రయం పొందే హక్కు ఉంది. ఈ తరహాలో భవనాలు కూల్చివేయడం ఒక ఫ్యాషన్ కాకూడదు.. అని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. బాధితులకు ఆరు వారాల్లోగా రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థను ధర్మాసనం ఆదేశించింది.

ప్రయాగ్‌రాజ్ ఇళ్ల కూల్చివేతల బాధితుల్లో అడ్వకేట్ జుల్ఫికర్ హైదర్, ప్రొఫెసర్ అలీ అహ్మద్, మరి కొందరు ఉన్నారు. కూల్చివేతలకు సంబంధించి వీరు వేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు గతంలో తోసిపుచ్చింది. దీంతో వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, 2023లో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌కు చెందిన భూమిగా భావించి అందులోని నివాసాలను రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసిందని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తగిన లీగల్ ప్రక్రియ పాటించకుండా ప్రయాగ్‌రాజ్‌లో ఇళ్లను కూల్చివేత దిగ్భ్రాంతి కలిగించిదని, ఈ చర్య తప్పుడు సంకేతాలు పంపుతోందని గతంలోనూ సుప్రీంకోర్టు మందలించింది.

# అత్యాచారం కేసు.. మతబోధకుడు బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు

చండీగఢ్: పంజాబ్‌కు చెందిన ప్రముఖ మతబోధకుడు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ బాజిందర్ సింగ్‌కు అత్యాచారం కేసులో జీవితఖైదు శిక్ష పడింది. 2018లో ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గానూ ఇటీవల అతడిని దోషిగా తేల్చిన మొహాలీ కోర్టు.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది.



బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని జిరాక్‌పూర్‌కు చెందిన ఓమహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు తీసుకెళతానని ఆశపెట్టి అతడు తనను ఇంటికి ఆహ్వానించాడని బాధితురాలు తెలిపింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడి.. ఆ దృశ్యాలను రికార్డ్ చేశాడని ఆరోపించింది. అతడి డిమాండ్లకు అంగీకరించకపోతే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. కొద్ది నెలల కిందట ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది.

హరియాణాకు చెందిన బాజిందర్ సింగ్ ఓ జాట్ కుటుంబంలో జన్మించాడు. 2012లో మతబోధకుడిగా మారాడు. జలంధర్, మొహాలీల్లో ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశాడు. అనతి కాలంలోనే పాపులర్ అయిన సింగ్‌కు సోషల్ మీడియాలోనూ లక్షలాది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, ఇతడిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తెకు నయం చేస్తానని డబ్బులు తీసుకున్నట్లు ఢిల్లీకి చెందిన దంపతులు 2022లో కేసు పెట్టారు. 2023లో సింగ్ నివాసాల్లో ఆదాయపు పన్ను విభాగం సోదాలు కూడా చేసింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో కపుర్తలాకు చెందిన మరో యువతి అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

## 18 మంది మృతి

బనస్కాంత: గుజరాత్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బనస్కాంత జిల్లాలోని దీశ పట్టణంలో ఉన్న ఓ బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో వరుస పేలుళ్లు సంభవించాయి. దీంతో మంటలు చెలరేగాయి. మంగళవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మొత్తం 18 మంది మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుళ్ల ధాటికి ఫ్యాక్టరీ పైకప్పు కుప్పకూలింది. శిథిలాల కింద మరికొంత మంది కూలీలు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది హుటా హుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు.

శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీస్తున్నారు. ఈ సంఘటనపై దీశ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ చౌదరి మాట్లాడుతూ.. దీశ ఇండస్ట్రియల్ ఏరియాలో భారీ పేలుడు సంభవించినట్లు ఉదయం మాకు సమాచారం అందింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడ్డ నలుగురు కూలీలను ఆస్పత్రికి తీసుకెళ్లాము. పేలుడు చాలా భారీ స్థాయిలో జరిగింది. దీంతో ఫ్యాక్టరీ స్లాబ్ మొత్తం కూలిపోయింది. స్లాబ్ కింద ఇరుక్కుపోయిన వారిని బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫ్యాక్టరీ యజమాని ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# దేశంలో ఆరుకు తగ్గిన నక్సల్స్ ప్రభావిత జిల్లాలు



**- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ: దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఆరుకు తగ్గాయని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య తరచూ ఎదురు కాల్పుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనల్లో పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతుండగా... మరికొందరు ప్రభుత్వానికి లొంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు పరిమితమైనట్లు పేర్కొన్నారు. దీంతో మనం మరోమైలు రాయిని చేరుకున్నామన్నారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏడాది మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా పెకిలించివేస్తామని పునరుద్ఘాటించారు.

హెూంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం..దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 2015లో 35ఉండగా.. 2018నాటికి 30కి తగ్గాయి. 2021 నాటికి 25కు వచ్చాయి. తాజాగా భద్రతా దళాలు చేపడుతున్న వరుస దాడుల వల్ల ఇవి 6కు చేరాయి. ఇలాఉంటే బస్తర్ ప్రాంతంలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందింది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌లో 135మంది మావోయిస్టులు భద్రతా సిబ్బంది కాల్పుల్లో చనిపోయారు. ఇందులో 119మంది ఒక్క బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు.గత శనివారం సుక్మా, బీజాపూర్‌ల్లో జరిగిన రెండు ఘటనల్లో 18 మంది మావోయిస్టులు మృతిచెందారు. మరో వైపు సోమవారం 50మంది మావోయిస్టులు తాము లొంగిపోతున్నట్లు ప్రకటించారు.

# 50మంది చిన్నారుల సజీవ సమాధి

- ఇద్దరు ప్రీస్కూలు టీచర్లు కూడా..
- వెల్లడించిన ఐరాస సిబ్బంది
- మరో భవనం కింద 400మంది కార్మికులు?
- కుళ్లిన శవాలతో మాండలే దుర్గంధం
- 2.7వేలు దాటిన మృతుల సంఖ్య
- భీతావహ దృశ్యంగా మాండలే నగరం



మయన్మార్‌లో సంభవించిన భూవిలయంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం సంభవించిన భూకంప దాటికి 2,719 మంది ప్రాణాలు కోల్పోయారని తాజాగా స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వారిలో 5 ఏళ్లలోపు చిన్నారులు 50మంది ఉన్నారని తెలిపాయి. 4,521మంది గాయపడగా.. 441మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది. అయితే, ఇప్పటికీ సహాయక బృందాలు చేరుకోలేని ప్రభావిత ప్రాంతాలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.. దాంతో శిథిలాల కింద చిక్కుకున్నవారిని కాపాడే పరిస్థితి లేకపోయింది. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్తచేతులతో, చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ, ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు ప్రజలు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రీస్కూల్ కూలిపోవడంతో 50మంది చిన్నారులు,ఇద్దరు టీచర్లు చనిపోయారని ఐరాస సిబ్బంది వెల్లడించారు. వివిధ దేశాలనుంచి వస్తోన్న సహాయక బృందాలు భూకంప తాకిడి ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు ఆయా చోట్ల ప్రభుత్వ, తిరుగుబాటు దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాల మధ్య మృతుల సంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, నీరు, షెల్టర్ తక్షణమే అందాల్సిన పరిస్థితులు నెలకొన్నా యని సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలు పిలుపునిస్తున్నాయి.

**ఆ శిథిలాలకింద 400మంది?**

ఇటీవల మయన్మార్‌తోపాటు థాయిలాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే రెండుసార్లు భారీ భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. భూ ప్రకంపనల ధాటికి అనేక భవంతులు ఊగిపోగా.. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలోవున్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కుప్పకూలింది. ఘటనలో పలువురు మృతిచెందగా.. 74మంది శిథిలాల కింద చిక్కుకున్నారని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఆ సంఖ్య 300నుంచి 400వరకు ఉండే అవకాశముందని తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకూ ఇక్కడ 13 మృతదేహాల వెలికితీసినట్లు అధికారులు పేర్కొన్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన నిర్మాణ కార్మికుల్లో దాదాపు 60మంది మయన్మార్ వాసులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మిగతా వారంతా కూలి పనుల కోసం విదేశాలనుంచి తీసుకొచ్చిన కార్మికులేనని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సజీవంగా ఉన్నవారిని, మృతదేహాలను గుర్తించడానికి అధునాతన పరికరాలతో పాటు జాగిలాలను ఉపయోగిస్తున్నారు. 2020లో ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీని నిర్మాణంలో చైనాకు చెందిన సంస్థకు భాగస్వామ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ భవంతి కూలిన తర్వాత నలుగురు చైనీయులు శిథిలాలున్న ప్రాంతంవద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలను తీసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇతర ఎత్తయిన భవనాలు సురక్షితంగానే ఉన్నా, ఇది మాత్రమే కూలిపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. శిథిలాల నుంచి సేకరించిన నిర్మాణ సామగ్రిని పరిశీలించగా.. అందులో నాసిరకం ఉక్కు, ఇతర, నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తించామన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడం కోసం వాటిని పరీక్షలకు పంపామని.. వారం రోజుల్లో నివేదిక వస్తుందని వెల్లడించారు.

శుక్రవారం 7.7 తీవ్రతతో ప్రకంపనలు సంభవించడంతో ఈ భవనం కూలిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అటు మయన్మార్‌లో ఈ భూకంపం కారణంగా భారీగా ప్రాణ నష్టం సంభవించింది. భూవిలయంలో మృతుల సంఖ్య 2,056కి పెరగగా.. 3900 మందికి పైగా గాయపడినట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికీ ఇంకా 270మంది ఆచూకీ లభ్యం కాలేదని తెలిపింది. అటు బ్యాంకాక్‌లో మృతుల సంఖ్య 19కి పెరిగింది.

---

### అలా జరిగితే..

# అణ్వాయుధ దాడే

### అమెరికాకు గట్టి స్వరమే వినిపిస్తున్న ఇరాన్



అణ్వాయుధాల ఒప్పందం విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అగ్రరాజ్యం తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై ఖమేనీ సలహాదారుడు అలీ లారిజానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే తాము అణ్వాయుధాల వైపు వెళ్లాల్సి వస్తుందన్నారు. "మేం అణ్వాయుధాల వైపు వెళ్లాలనుకోవడం లేదు. మీరు ఇరాన్ విషయంలో ఏదైనా తప్పు చేస్తే.. దేశాన్ని రక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. ఇంతకుమించి తమకు వేరే అవకాశం లేదన్నారు. ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతంలో అమెరికన్లకు కనీసం 10 స్థావరాలు.. 50,000 మంది సైనికులు ఉన్నారని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ సీనియర్ కమాండర్ జనరల్ అమిరాలి హజీజాదే పేర్కొన్నారు. అద్దాలమేడలో కూర్చున్న అధికారులు తమపై రాళ్లు విసిరితే.. అవి తిరిగి వారి మేడలనే కూల్చేసే అవకాశం ఉందన్నారు.కాబట్టి తమపై విమర్శలు చేసే ముందు అగ్రరాజ్యం మరోసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు.

ఇరాన్-అమెరికా మధ్య గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హౌతీ తిరుగుబాటుదారులకు అండగా నిలుస్తున్న టెహ్రాన్‌కు అగ్రరాజ్యం గట్టిగానే హెచ్చరికలు చేసింది. దీనికి ఇరాన్ స్పందిస్తూ.. తన కొత్త భూగర్భ క్షిపణి నగరానికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది. ఇందులో ఖైబర్ షేకన్స్, ఘద్రహస్, సెజ్జిల్స్, హజ్ ఖాసీమ్స్, పవేహ్ ల్యాండ్ అటాక్ క్షిపణులు ఉన్నాయి.

మరోవైపు, ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసేలా.. అణు ఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. పరోక్ష చర్చలకు మాత్రందారులు తెరిచే ఉన్నాయని అన్నారు.

ఈ పరిణామాలతో అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని పెంచారు. ఒప్పందాన్ని కుదుర్చుకోని పక్షంలో.. ఇరాన్‌పై బాంబు దాడులకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు తప్పవని బెదిరింపులకు పాల్పడ్డారు.

---

# చైనాకు దగ్గరయ్యే కుయుక్తి

### భారత్‌పై నోరు పారేసుకున్న బంగ్లా యూనస్

### రెచ్చగొట్టే వ్యాఖ్యలంటూ భారత్ నేతల ఆగ్రహం

షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత నుంచి బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక వైఖరి కనిపిస్తోంది. తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ అనుసరిస్తోన్న విధానాలే అందుకు నిదర్శనం. న్యూఢిల్లీకి క్రమంగా దూరమవుతున్న బంగ్లా.. పాకిస్థాన్, చైనాతో సంబంధాలు పెంచుకోవడానికి ఆరాటపడు తోంది. ఈ తరుణంలోనే గతవారం యూనస్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో భారత్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు తాజాగా వైరల్ అవుతున్నాయి. బీజింగ్ అంద చూసుకొని భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా గతవారం యూనస్ చైనాలో పర్యటించారు. ఆ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ భేటీ అయ్యారు. బంగ్లాదేశ్‌లో డ్రాగన్ కార్యకలాపాలు విస్తరించుకోవచ్చంటూ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా భారత ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలతో నోరుపారేసుకున్నారు. "భారత ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ అంటారు. అవి బంగ్లాదేశ్‌తో భూపరివేష్టితమై ఉన్నాయి. వారికి సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదు. ఈ ప్రాంతంలో సముద్రానికి మేమే రక్షకులం. కాబట్టి ఇది భారీ అవకాశం. చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది" అని వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న ఓ వీడియో వైరల్ అవుతోంది.



ప్రధాని మోదీకి ఆర్థికపరమైన సల హాలు ఇచ్చే ఎకనమిక్అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడు సంజీవ్ సన్యాల్ దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేశారు. "భారత్‌లో ఏడు రాష్ట్రాలు భూపరివేష్టితంగా ఉన్నాయంటూ చైనీ యులను యూనస్ బహిరంగంగా ఆహ్వానించడం ఆశ్చర్యంగా ఉంది. అసలు ఆ రెండు విషయాల మధ్య సంబంధమేంటి..?" అని ఆయన ప్రశ్నించారు.

**రెచ్చగొట్టే వ్యాఖ్యలంటూ భారత్ ఆగ్రహం**

చైనా పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. బంగ్లాదేశ్‌తో భూపరివేష్టితమైన భారత ఈశాన్య రాష్ట్రాలకు సముద్రానికి చేరుకోవడానికి మార్గంలేదని, ఆ ప్రాంతానికి తామే రక్షకులమంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆయన తీరును భారత నేతలు ఖండిస్తున్నారు. అవి ప్రమాదకర వ్యాఖ్యలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మండిపడగా.. ఇలాంటి పరిస్థితుల్లో ఈశాన్యరాష్ట్రాల పరంగా కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం ఏవిధంగా ఉండనుందని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. "యూనస్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. అవి పూర్తిగా ఖండించదగినవి. భారత వ్యూహాత్మక కారిడార్ చికెన్స్ నెక్ కారిడార్‌తో ముడిపడి ఉన్న అంశాలు..ఆయన వ్యాఖ్యలకు కారణం. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి భూభాగంలో ఇది ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలను భారత ప్రధాన భూభాగంతో ఈ కారిడార్ కలుపుతోంది. దీనిచుట్టూ నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ విస్తరించి ఉన్నాయి. గతంలోనూ ప్రధాన భూభాగాన్ని, ఈశాన్య ప్రాంతాన్ని విడిచేసేలా స్వదేశంలోనే వ్యతిరేక శక్తులు ప్రయత్నించాయి. అందుకే ఆ కారిడార్ అంతటా సమర్థవంతమైన రైల్వే, రోడ్డు నెట్వర్క్ అభివృద్ధి చేయడం అత్యావశ్యకం. ఇంకా.. చికెన్స్ నెకను బైపాస్ చేసేలా రెండు భూభాగాలను అనుసంధానించే ప్రత్యామ్నాయ రహదారి మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే అందుకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. సంకల్పం, ఆవిష్కరణలతో ఆ దిశగా విజయం సాధించవచ్చు. ఇక యూనస్ చేసిన ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను తేలిగ్గా తీసుకోవద్దు. అవి వారి దీర్ఘకాలిక వ్యూహాలను ప్రతిబింబిస్తున్నాయి" అని హిమంత దుయ్యబట్టారు.ఇక ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఆందోళన వ్యక్తంచేశారు. "బంగ్లాదేశ్ అనుసరిస్తోన్న విధానం మన ఈశాన్య ప్రాంతానికి తీవ్ర ముప్పుగా కనిపిస్తోంది. మన ప్రభుత్వం మణిపూర్‌ను పట్టించుకోవడం లేదు. అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా ఒక గ్రామాన్ని నిర్మించింది. తమ దేశ (బంగ్లాదేశ్) నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మనల్నే చుట్టుముట్టాలని బంగ్లా ప్రయత్నిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో మన విదేశాంగ విధానం దయనీయంగా కనిపిస్తోంది" అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఐపీఎల్‌లో పంజాబ్ హవా

- లక్నోపై 8 వికెట్లతో సునాయాస విజయం
- అర్ధసెంచరీలతో మెరిసిన ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్
- 7 వికెట్లకు 171 పరుగులు చేసిన లక్నో
- మరోసారి నిరాశపరిచిన పంత్
- 172 పరుగుల లక్ష్యాన్ని 16.2 ఓవర్లలోనే ఛేదించిన పంజాబ్



లక్నో: పంజాబ్ కింగ్స్ ఐపీఎల్‌లో తన హవా కొనసాగిస్తోంది. తొలి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించిన పంజాబ్ కింగ్స్ తాజా మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై 8 వికెట్లతో సునాయాస విజయం సాధించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69) మెరుపు అర్ధశతకం సాధించడంతో పోటీ ఏకపక్షంగా మారిపోయింది. వరుసగా రెండో మ్యాచ్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్) అర్ధశతకం సాధించాడు. నేహల్ వధేరా (43 నాటౌట్) కూడా సమయోచితంగా రాణించడంతో ఈ సీజన్‌లో పంజాబ్ వరుసగా రెండో విజయం సాధించింది.

లక్నోలోని ఏక్నా స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగుకు దిగిన పంజాబ్ 16.2 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆరంభంలోనే ప్రియాంశ్ ఆర్య (8) వికెట్ కోల్పోయినప్పటికీ ప్రభ్‌సిమ్రన్ సింగ్, శ్రేయస్ అయ్యర్ అద్భుత హాఫ్ సెంచరీలతో పంజాబ్‌ను విజయతీరాలకు చేర్చారు. చివర్లో నేహల్ వధేరా వేగంగా ఆడాడు. దీంతో పంజాబ్ 16.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69, 34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్, 30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) అర్ధ శతకాలతో అదరగొట్టారు. శ్రేయస్ సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ముగించడంతోపాటు అర్ధ శతకం అందుకున్నాడు. నేహల్ వధేరా (42 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. లక్నో బౌలర్లలో దిగ్వేశ్ రాథీ (2/30) రాణించగా.. మిగతా బౌలర్లు తేలిపోయారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రేయస్ అయ్యర్ నమ్మకాన్ని నిలబెడుతూ పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. నికోలస్ పూరన్ (44), ఆయుష్ బదోనీ (41) చెప్పుకోదగ్గ స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (28), అబ్దుల్ సమద్ (27) విలువైన పరుగులు చేశారు. దీంతో లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. కెప్టెన్ రిషభ్ పంత్ (2) మరోసారి విఫలమయ్యాడు.

లక్నో ఇన్నింగ్స్‌లో మిచెల్ మార్ష్ మొదటి ఓవర్లోనే అవుట్ కావడం, జట్టును కొంత ఇబ్బంది పెట్టింది. ఆ క్రమంలో 3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి, లక్నో స్కోరు 20 పరుగుల వద్ద నిలిచింది. ఇక, ఐడెన్ మార్క్రమ్ 18 బంతుల్లో 28 పరుగులు చేసి ఔట్ అవ్వడంతో, మరోసారి లక్నోకు ఎదురుదెబ్బ తగిలింది. రిషబ్ పంత్ కూడా 5 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసి అవుట్ అవడం, లక్నో జట్టుకు మరో షాక్ ఇచ్చింది.

అయినా నికోలస్ పూరన్ తన అద్భుత బ్యాటింగ్‌తో జట్టును నిలబెట్టాడు. 30 బంతుల్లో 44 పరుగులతో, పూరన్ ఆకట్టుకున్నప్పటికీ, నికోలస్ పూరన్ 4వ వికెట్‌గా ఔట్ అయ్యాడు. లక్నో స్కోరు 91/4గా నిలిచింది. ఈ క్రమంలో 15 ఓవర్లకు ముగిసే సమయానికి, లక్నో జట్టు 4 వికెట్ల నష్టంతో 116 పరుగులు చేసింది. అదే క్రమంలో లక్నోకు ఐదవ దెబ్బ తగిలింది. డేవిడ్ మిల్లర్ 19 పరుగులు చేసిన తర్వాత మార్కో జెన్సన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.

ఈ విధంగా లక్నో ఐదో వికెట్ కోల్పోయింది. 17 ఓవర్లు ముగిసే సరికి లక్నో 5 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ఆయుష్ బదోని రూపంలో లక్నోకు ఆరో షాక్ తగిలింది. బదోని 41 పరుగులు చేసిన తర్వాత అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. ఆ తర్వాత 27 పరుగులు చేసిన తర్వాత అబ్దుల్ సమద్‌ను అర్ష్‌దీప్ సింగ్ అవుట్ చేశాడు. దీంతో లక్నో చివరకు 20 ఓవర్ల నష్టానికి 171 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు తీశాడు. ఫెర్గూసన్, మ్యాక్స్‌వెల్, జాన్సన్, ఛాహల్ ఒక్కో వికెట్ తీశారు.

## టీ 20ల్లో 8 వేల పరుగుల క్లబ్‌లో సూర్యకుమార్



టీ 20ల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సరసన సూర్యకుమార్ యాదవ్ చేరాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున సూర్యకుమార్ యాదవ్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 9 బంతుల్లో 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ క్రమంలో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 క్రికెట్లో టీమ్ ఇండియా తరఫున 8000 పరుగులు పూర్తి చేసుకున్న అయిదో ఆటగాడిగా ఘనత సాదించాడు. ఈ ఫీట్ తో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సరసన నిలిచాడు. టీ 20 ఫార్మాట్లో 384 ఇన్నింగ్స్‌లో 12,976 పరుగులతో విరాట్ కోహ్లి మొదటి స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ 437 ఇన్నింగ్స్‌లో 11,838 పరుగులతో రెండో స్థానంలో, 9797 పరుగులతో (331 ఇన్నింగ్స్‌లు) శిఖర్ ధావన్ మూడో స్థానంలో, 8654 పరుగులతో సురేశ్ రైనా (319 ఇన్నింగ్సులు) నాలుగో స్థానంలో ఉన్నారు. సూర్యకుమార్ మొత్తం 288 ఇన్నింగ్స్‌లో 8007 పరుగులు చేసి అయిదో స్థానానికి చేరాడు. 152.28 స్ట్రయిక్ రేట్‌తో 34.21 సగటుతో ఈ రన్స్ సాధించాడు. సూర్యకుమార్ ఇప్పటి వరకు టీ20 (120)ల్లో 6 సెంచరీలు, 54 అర్ధశతకాలు చేశాడు. ఇదే ఫార్మాట్లో టీమిండియాకు కెప్టెన్‌గా 79 ఇన్నింగ్స్‌లో 167.07 స్ట్రైక్రేట్, 38.20 యావరేజ్‌తో 2598 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు శతకాలు, 21 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## ఏ ప్లస్ కాంట్రాక్ట్‌లోనే కోహ్లి, రోహిత్?

### సెంట్రల్ కాంట్రాక్ట్‌లో శ్రేయస్‌కూ చోటు

బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ల్లో టీమిండియా దిగ్గజాలైన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఏ ప్లస్ కాంట్రాక్ట్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. 2024 టీ20 వరల్డ్ కప్ విజయం తరువాత కోహ్లి, రోహిత్ టీ 20లకు రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలో ప్రక టించనున్న బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు జాబితా లో వారు ఏ ప్లస్ నుంచి ఏ గ్రేడ్‌కు వస్తారని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. టెస్టు, వన్డే, టీ20 ఈ మూడు ఫార్మాట్లలో జాతీయ జట్టుకు ప్రాతి నిధ్యంవహిస్తూ రాణిస్తున్న వారికే బీసీసీఐ నుంచి ఏ ప్లస్ కాంట్రాక్టు దక్కుతుంది. ఈ పరిస్థితుల్లో టీ 20లకు రిటైర్‌మెంట్ ప్రకటించిన కోహ్లి, రోహిత్‌కు ఏ ప్లస్ కాంట్రాక్ట్ దక్కే అవకాశం లేదు. అయితే మేటి క్రికెటర్లైన రోహిత్, కోహ్లికి అదే గ్రేడ్ కొనసా గించి బీసీసీఐ గౌరవించనున్నట్లు తెలుస్తోంది.



గతంలో దేశవాళీ క్రికెట్ ఆడని కారణంగా శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ ఆగ్రహానికి గురయ్యాడు. దీంతో సెంట్రల్ కాంట్రాక్టు జాబితా నుంచి తన స్థానం కోల్పోయాడు.

ఈ సీజన్‌లో ముంబై తరఫున రంజీల్లో శ్రేయస్ సత్తాచాటాడు. అయిదు మ్యాచుల్లో 68.57 యావరేజ్, 90.22 స్ట్రయిక్ రేట్‌తో 480 పరుగులు చేశాడు. అలాగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచుల్లో 345 పరుగులు రాబట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో అయిదు మ్యాచుల్లో 325 రన్స్‌చేసి రాణించాడు. భారత్ విజయం సాధించిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ 243పరుగులతో భారత జట్టు తర పున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టీమ్ ఇండియా టోర్నీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో అతడికి కూడా జాబితాలో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం.

దీనిపై బీసీసీఐ వర్గాలు మాట్లాడుతూ.. రోహిత్, విరాట్ కోహ్లి ఏ ప్లస్ గ్రేడ్లోనే కొనసాగు తారు. వారు 7 ఏడు కోట్ల రూపాయల వార్షిక ప్యాకేజీని పొందుతారు. వారు టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయినా సరే వారి గ్రేడ్ తగ్గదు. వారు టీమ్ ఇండియా కోసం ఎంతో కృషి చేశారు. ఎన్నో విజయాలందించారు. కాంట్రాక్టులో అదే గ్రేడ్ కొనసాగించి క్రికెట్ బోర్డు వారిని గౌరవించాలను కుంటోంది. శ్రేయస్ అయ్యర్ కూడా తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి రానున్నాడని తెలిపాయి.

## పవర్ ప్లేలో అశ్విన్ బౌలింగ్ వద్దు: శ్రీకాంత్

ఐపీఎలక్ష-2025లో వరుసగా రెండు మ్యాచ్‌లో ఓడిపోయిన నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్కే) కు టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఒక సలహా ఇచ్చాడు. వెటరన్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్‌తో పవర్‌ప్లేలో బౌలింగ్ చేయించొద్ద న్నాడు. గతేడాది అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ ఈ ఐపీఎల్ సీజన్‌లో సీఎస్కేకి ఆడుతున్నాడు. దాదాపు 12 ఏళ్ల తర్వాత అశ్విన్ తిరిగి సొంత గూటికి చేరుకున్నాడు. ఒకప్పు డు తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు చుక్కలు చూపించిన అశ్విన్ ఇప్పుడు పెద్దగా రాణించట్లేదు. భారీగా పరుగులు ఇవ్వడం తోపాటు వికెట్లూ తీయడం లేదు. ఇప్పటి వరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఓవర్లు వేసిన అతను 9.90 ఎకానమీతో మూడు వికెట్లు తీశాడు. మరోవైపు, తొలి మ్యాచ్‌లో ముంబయి పై గెలిచిన చెన్నై.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. ఈ నేపథ్యంలో సీఎస్కేకు కృష్ణమాచారి శ్రీకాంత్ పలు సూచనలు చేశాడు. పవర్ ప్లేలో అశ్విన్‌తో బౌలింగ్ చేయించొద్దని సూచించాడు.

జట్టులో కొన్ని మార్పులు చేస్తే జట్టు తిరిగి గాడి లో పడుతుందన్నాడు. అశ్విన్‌ను తుది జట్టు నుంచి తప్పించొద్దు. కానీ, పవర్ ప్లేలో అతడితో బౌలింగ్ చేయించడం ఆపేయాలి, రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్‌తో కలిసి 7-18 ఓవర్ల మధ్య అశ్విన్ ప్రభావం చూపించగలడు. ఓపెనర్ రాహుల్ త్రిపాఠీని తప్పించి అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం ఇవ్వాలి. ఒవర్టన్ స్థానంలో దేవాన్ కాన్వేను తుది జట్టులోకి తీసుకోవాలి. శివమ్ దూబె కూడా తుది జట్టులో ఉండాలి. పేసర్ ముకేష్ చౌదరిని సరిగా వినియోగించుకోవాలి. అతను గతంలో సీఎస్కే తరఫున బాగా బౌలింగ్ చేశాడని కృష్ణమాచారి శ్రీకాంత్ వివరించాడు. చెన్నై తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. ఏప్రిల్ 5న చెన్నై వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.

# అనీల్.. మామూలోడుకాదు!



మెగాస్టార్ చిరంజీవి -హిట్టు డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో ఉగాది రోజున అనౌన్స్ చేసిన చిత్రం -మెగా 157. సంక్రాతికి వస్తున్నాం చిత్రంతో హిట్టుమీదున్న డైరెక్టర్‌తో ప్రాజెక్టు కావడంతో.. కాంబినేషన్ ఫిక్సైన దగ్గర్నుంచే ప్రాజెక్టుమీద బజ్ ఉంది. తాజాగా సినిమా ముహూర్త కార్యక్రమాలతో మొదలైందో లేదో అనీల్ రావిపూడి అప్పుడే తన మార్క్ ప్రమోషన్స్‌ని మొదలుపెట్టేశాడు. టాలీవుడ్‌లో అనీల్ రావిపూడి మార్కెటింగ్ స్టయిల్ ఆసక్తి రేకెత్తిసుందన్నది ఇప్పటి వరకూ వచ్చిన సినిమాల ప్రమోషన్స్ చెప్పకనే చెప్తున్నాయి. మొన్నటికి మొన్న సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్స్ చూసి అంతా ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇప్పుడు ఇదే ఫార్మాట్‌లో చిరు సినిమాపై ఓ క్రేజీ వీడియో రిలీజైంది. చిరంజీవి చేసిన కొన్ని ఐకానిక్ పాత్రల చిత్రాలతో సినిమా మెయిన్ టీమ్‌ను పరిచయం చేస్తూ ప్లాన్ చేసిన వీడియో సూపర్ ఎంటర్టైనింగ్‌గా ఉంది. ఇక ఇందులో మెగాస్టార్ ఎనర్జీకానీ కామెడీ టైమింగ్‌కానీ అదిరిపోయాయి. అలానే లాస్ట్‌లో అనీల్‌తో ఇది చాలదంటూ తన మార్క్ కామెడీ టైమింగ్‌తో చిరంజీవి 'రఫ్ఫాడించాల్సిందే' అంటూ రివీల్ చేసిన వీడియో మెగా ఫ్యాన్స్‌కి మంచి కిక్. ఇక షూటింగ్ అతి త్వరలోనే స్టార్ట్ కానున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేయగా.. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయడానికీ సన్నద్ధమవుతున్నారు.




## బోల్తా కొట్టిందిలే...
# బుల్‌బుల్‌పిట్ట

నేషనల్ క్రష్ రష్మిక ప్రస్తుతం ఎలాంటి ఫామ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. వరుసగా పాన్ ఇండియా చిత్రాలు.. స్టార్ హీరోల సరసన ఆఫర్లతో ఈ బ్యూటీ ఏ హీరోయిన్ పోటీ పడలేనంతగా దూసుకుపోతుంది. పుష్ప-2 గ్రాండ్ సక్సెస్, ఛావా సెన్సేషన్.. ఇలా బ్యాక్ టు బ్యాక్ నేషనల్ స్థాయిలో తన సత్తా చాటుకుంది ఈ బ్యూటీ. అయితే, ఇప్పుడు మాత్రం రష్మికకు బ్యాడ్ టైమ్ ఎదురైందని చెప్పాలి. టాలీవుడ్‌లో తప్పించుకున్న రష్మిక బాలీవుడ్ దగ్గర బుక్ అయ్యింది. హీరో నితిన్ నటించిన 'రాబిన్‌హుడ్' మూవీ ఇటీవల రిలీజై యావరేజ్ రిజల్ట్‌ను రాబడుతోంది. ఇక ఈ సినిమాలో తొలుత రష్మిక హీరోయిన్‌గా ఓకే చెప్పింది. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ ఛాన్స్ శ్రీలీలకు వెళ్లింది. ఈ సినిమాలో ఆమె పాత్రపై సోషల్ మీడియాలో చాలా నెగెటివిటీ వస్తుంది. దీంతో రష్మిక ఈ సినిమా చేయకపోవడం చాలా మంచిదయ్యిందని అందరూ అనుకున్నారు. కానీ, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్' సినిమాలో నటించిన రష్మిక, అక్కడ మాత్రం ఫ్లాప్‌ను మూటగట్టుకుంది. భారీ అంచనాలతో రిలీజ్ అయిన సికందర్ చిత్రానికి ప్రేక్షకుల నుంచి నెగిటివ్ రెస్పాన్స్ దక్కింది. దీంతో ఈ సినిమాలో నటించినందుకు రష్మిక బుక్ అయ్యిందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఏదేమైనా సౌత్‌లో ఫ్లాప్ తప్పించుకున్న ఈ బ్యూటీ, నార్త్‌లో తప్పించుకోలేకపోయింది.



## రీసౌండిచ్చిన
# పెద్ది ఆడియో

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా టాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న లేటెస్ట్ చిత్రమే "పెద్ది". పక్కా స్పోర్ట్స్ అండ్ రూరల్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమా రీసెంట్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌తో సాలిడ్ హైప్‌ని అందుకుంది. ఇప్పుడు గ్లింప్స్ డేట్‌ని కూడా మేకర్స్ అనౌన్స్ చేయడంతో అంతా ఎగ్జైటింగ్‌గా ఎదురు చూస్తున్నారు. మరి ఈ తర్వాత సినిమా ఆడియో హక్కులపై కూడా మేకర్స్ క్లారిటీ ఇచ్చేసారు. భారీ రీచ్ ఉన్న టీ సిరీస్ ఈ చిత్రాన్ని సొంతం చేసుకున్నట్టుగా రివీల్ చేయగా.. ఈ సినిమా ఆడియో రైట్స్ భారీ ధరకి అమ్ముడు పోయినట్టుగా టాక్ వినిపిస్తోంది. దీనితో పెద్ది పాన్ ఇండియా భాషల ఆడియో హక్కులు టీ సిరీస్ ఏకంగా 35 కోట్లు చెల్లించి సొంతం చేసుకున్నట్టు సమాచారం. ఇది మన తెలుగు సినిమాల్లో అత్యధికం అన్నట్టు తెలుస్తుంది. ఇక ఈ చిత్రానికి లెజెండరీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అవైటెడ్ గ్లింప్స్ ఏప్రిల్ 6న రామనవమి కానుకగా రాబోతుందట.



# అఖిల్ బర్త్‌డే ట్రీట్ ఉంటుందా?

యంగ్ హీరోస్‌లో అఖిల్ అక్కినేనికి చెప్పుకోదగ్గ హిట్లు లేకున్నా.. సినిమా మొదలవుతుందటే చాలు.. బజ్ మొదలై పోతుంది. బహుశా అక్కినేని ఫ్యామిలీలో ప్రస్తుతం ఈ రేంజ్‌లో అఖిల్‌కి మాత్రమే ఈ తరహా ఫీట్ సాధ్యమైందని అను కోవాలి. తన లాస్ట్ చిత్రం ఏజెంట్ తర్వాత మళ్లీ తన కెరీర్ 6వ సినిమాపట్ల మంచి సస్పెన్స్ నెలకొంది. అయితే ఈ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నసంగతి తెలిసిందే. మరి ఈసినిమా నుంచి టైటిల్ సహా ఫస్ట్ లుక్ రిలీజ్‌కి డేట్ లాక్ అయినట్టుగా ఇపుడు తెలుస్తుంది. ఏప్రిల్ 8న అఖిల్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ ట్రీట్‌ని ఫ్యాన్స్‌కి అందిస్తారని అంటున్నారు. దీని పై అఫీషియల్‌గా క్లారిటీ రావాల్సి ఉంది.



# ఆ కాంబో రిపీట్ కావట్లేదు

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం మాస్‌చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను డైరెక్షన్‌లో 'అఖండ 2 తాండవం' మూవీ లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమాకు సంబంధించి రోజుకో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ విద్యా బాలన్ కీలక పాత్రలో నటించబోతుందని తెలుస్తోంది. అయితే, ఈ వార్తపై విద్యా బాలన్ టీమ్ క్లారిటీ ఇచ్చింది.ఈ సినిమాలో విద్యాబాలన్ నటించడం లేదని..ఆమెకు'అఖండ 2'తో ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ వచ్చేసింది. దీంతో విద్యాబాలన్ అఖండ-2లో నటిస్తుందనే వార్త కేవలం రూమర్అని తేలిపోయింది. గతంలో బాలయ్య నటించిన ఎన్టీఆర్ బయోపిక్ మూవీలో విద్యాబాలన్ నటించిన సంగతితెలిసిందే. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను మెప్పించడంతో, ఇప్పుడు అఖండ 2లో ఆమె నటిస్తుందనే వార్త చక్కర్లు కొట్టింది. ఇక అఖండ 2లో యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ సినిమా

## బేబీ..
# వరుసపెడుతోందిగా

'బేబీ' సినిమాతో తొలి అడుగులోనే అందం.. అభినయాలతో కట్టిపడేసిన తెలు గందం వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఆమె సిద్ధు జొన్నలగడ్డతో 'జాక్'తో పాటు ఆనంద్ దేవరకొండ -ఆదిత్య హాసన్ కాంబోలో ఓ సినిమా చేస్తోంది. కాగా, ఇప్పుడామె ఖాతాలో మరో రెండు ప్రాజెక్టు చేరనున్నట్టు తెలుస్తోంది. వీటిలో ఒకటి నాయికా ప్రాధాన్య చిత్రమని సమాచారం. ఓ కొత్త దర్శకుడు వైష్ణవి కోసం ఓ విభిన్నమైన థ్రిల్లర్ కథ సిద్ధం చేశారని.. అది తనకు నచ్చడంతో సినిమా చేసేందుకు సిద్ధమైందని తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. మరోవైపు వైష్ణవి చైతన్యను తమిళ తెరకు పరిచయం చేసేందుకు పలువురు దర్శకులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలో విష్ణు విశాల్ హీరోగా చేయనున్న ఓ సినిమాలో ఆమె నాయికగా కనిపించే అవకాశమున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విష యమై చర్చలు మొదలైనట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లుగా జరి గితే ఇదే వైష్ణవికి తొలి తమిళ సినిమా కానుంది.